Haqeeqat ki Talaash (Telugu)



# సత్యాన్వేషణ

**Haqeeqat ki Talaash**
**(Telugu)**

# సత్యాన్వేషణ

*మూలం:*
**మౌలానా వహీదుద్దీన్ ఖాన్**
*అనువాదం:*
**ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**


**GOODWORD**
**info@goodwordbooks.com**
**www.goodwordbooks.com**
**Contact No: 93940 03049, 95735 22690**

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ముస్లిం యూనివర్శిటీ స్టూడెంట్స్ యూనియన్, అలీగఢ్ తరఫున 1958 సెప్టెంబర్ మొదటి వారంలో ఇస్లామీయ ఉపన్యాసాల ఓ పరంపర "సిరీస్ ఆఫ్ లెక్చర్స్ ఆన్ ఇస్లామ్" అనే శీర్షికన ప్రారంభించబడింది. ఇప్పుడు మీ చేతిలో పుస్తకరూపంలో ఉన్న ఈ వ్యాసం యూనివర్శిటీ యూనియన్ హాలులో సెప్టెంబర్ 6న చదవబడింది.

విశ్వం ఓ పెద్ద గ్రంథం రూపంలో మనముందు వ్యాపించి ఉంది. కాని ఈ అపూర్వ గ్రంథంలోని ఏ పేజీలో కూడా దాని శీర్షిక కాని, గ్రంథ రచయిత పేరుకాని వ్రాయబడి లేదు. అయినా ఈ గ్రంథంలోని ఒక్కొక్క అక్షరం దీని శీర్షిక ఏమిటి, దీని రచయిత ఎవరు అని అంటోంది.

అప్పుడు ఎవరైనా ఓ వ్యక్తి నిశిత దృష్టితో చూడగలిగితే తానొక సువిశాల విశ్వం మధ్యలో ఉన్నట్లు గమనిస్తాడు. అప్పుడు అతని మేధలో, అప్రయత్నంగా "నేనెవరిని? ఈ విశ్వం ఏమిటి"? అనే ప్రశ్న ఉదయిస్తుంది. అప్పుడతను తనను గురించి, ఈ విశ్వాన్ని గురించి తెలుసుకోవాలని, అర్థంచేసుకోవాలని ఆరాటపడతాడు. తన నైజంలో దాగి ఉన్న సూచనలను చదివే ప్రయత్నం చేస్తాడు. ప్రపంచంలో అతడు ఏ ఏ పరిస్థితులను ఎదుర్కొంటున్నాడో వాటి అసలు కారణాలను తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు.

అంతేకాదు అతని మేధలో ఉత్పన్నమయ్యే సవాలక్ష ప్రశ్నలకు సమాధానాల కోసం ఎంతగానో శ్రమపడతాడు. కాని వాటి సమాధానాలేమిటో అతనికి బోధపడదు. ఈ ప్రశ్నలు కేవలం తత్వశాస్త్రానికి సంబంధించినవి మాత్రమే కాదు. మానవుని నైజం, అతని పరిస్థితుల సహజ ఫలితం కూడా! ఇవి ఎటువంటి ప్రశ్నలంటే దాదాపు ప్రపంచంలోని ప్రతి మనిషి ఎప్పుడో ఒకప్పుడు వీటిని ఎదుర్కోవలసిందే. వీటి సమాధానాలు దొరకని కారణంగా కొందరు పిచ్చివాళ్ళవుతారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటారు. కొందరి నిండు జీవితాలు అశాంతి, నిరాశా నిస్పృహలతో గడిచిపోతాయి. మరికొందరు తమ ప్రశ్నలకు సరైన సమాధానాలు పొందలేక ప్రాపంచిక వ్యామోహంలోపడి ఈ మానసిక బాధ నుండి విముక్తి పొందాలనుకుంటారు. ఈ ప్రపంచంలో అతడు ఏవైతే సాధించగలడో వాటిని సాధించే ప్రయత్నంలో, అతడు సాధించలేని విషయాలను మరచిపోవటానికి ప్రయత్నిస్తాడు.

ఈ ప్రశ్ననే మనం ఒక్క మాటలో “సత్యాన్వేషణ” అని పేర్కొనవచ్చు. కాని దీన్ని గనక మనం విభజించినట్లయితే ఇదింకా మరెన్నో ప్రశ్నల సము దాయంగా మనముందు ఉదయిస్తుంది. ఈ ప్రశ్నలు ఏమిటి అనే విషయాన్ని మనం వివిధ రకాలుగా పేర్కొనవచ్చు. కాని నేను నా సౌలభ్యం కోసం వీటిని మూడు శీర్షికలుగా వివరిస్తాను.

(1) సృష్టికర్త అన్వేషణ. (2) ఆరాధ్యుని అన్వేషణ. (3) పర్యవసానం అన్వేషణ.

అసలు నా దృష్టిలో సత్యాన్వేషణ అనేది ఈ మూడు ప్రశ్నలకు సమాధానం తెలుసుకునే సాధనం మాత్రమే. మీరు మరే రూపంలో ఈ ప్రశ్నను వివరించదలిచినా, వాస్తవంగా అది దీన్నే కొద్దిగా మార్చి చెప్పినట్లవుతుంది. ఇంకా ఈ మూడు విషయాల ఆధారంగానే వీటిని ఏకం చేయటానికి వీలవుతుంది.

బాహ్యాపరంగా ఈ ప్రశ్నలు ఎలాంటివనే విషయం మనకు ఏమీ తెలియదు. అంతే కాకుండా ఏదైనా పర్వత శిఖరంపై వీటి సమాధానాలు వ్రాసి  బోర్డు కూడా కట్టిలేదు. కాని వాస్తవం ఏమిటంటే అసలు ప్రశ్నలోనే దాని సమాధానం కూడా ఇమిడి ఉంది. విశ్వం తన యదార్థం వైపు తానే సైగ చేస్తుంది. ఒకవేళ అది మనల్ని నమ్మకమైన జ్ఞానం వైపునకు తీసుకు పోలేక పోతే అది వేరే విషయం. ఈ సైగ ఎంత స్పష్టంగా, సూటిగా ఉందంటే, ఒకవేళ మనకు ఎలాగైనా వాస్తవికతాజ్ఞానం తెలిసిపోతే నిస్సందేహంగా ఇదే యదార్థమని, ఇది తప్ప ఈ విశ్వానికి మరో వాస్తవికత ఉండజాలదని మన అంతరాత్మ ఘోషిస్తుంది.

ఈ విశ్వాన్ని చూడగానే మొట్టమొదట మన మేధలో ఉదయించే ప్రశ్న  ఏమిటంటే దీని సృష్టికర్త ఎవరు? ఈ మహోన్నత విశ్వకార్ఖానాను నిర్వహించేదెవరు? అనేది. పూర్వకాలంలో మనిషి ఎన్నో అతీత శక్తులు ఈ విశ్వానికి ప్రభువులని, ఒక పెద్ద దేవుని అధికారం క్రింద మరెందరో చిన్న చిన్న దేవుళ్ళు దీని నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని భావించేవాడు. ఈ కాలంలో కూడా చాలామంది ఈ విధమైనటువంటి నమ్మకం కలిగి ఉన్నారు. కాని ప్రస్తుత విజ్ఞాన యుగంలో సాధారణంగా ఈ విధమైనటువంటి సిద్ధాంతాలను నిరాకరించటం జరిగింది. ఇది కేవలం ఓ మృత సిద్ధాంతం మాత్రమే. ప్రస్తుత కాలంలో ఎంతగానో అభివృద్ధి చెందామని, నవీన నాగరికులమని గొప్పలు చెప్పుకునేవాళ్ళు బహుదైవారాధనకు బదులు నాస్తికత్వాన్ని అనుసరిస్తున్నారు. వీరి అభిప్రాయం ఏమిటంటే ఈ విశ్వాన్ని ఏ చైతన్య శక్తీ ఉనికిలోకి తేలేదు. ఇది కేవలం కాకతాళీయంగా జరిగిన ఓ సంఘటనా ఫలితం. ఎప్పుడైనా ఒక సంఘటన జరిగితే దాని కారణంగా మరెన్నో ఇతర

సంఘటనలు ఉనికిలోకి వస్తాయి. ఈ విధంగా కారణాలు, సంఘటనల ఓ సుదీర్ఘ పరంపర నిర్ణయమైపోతుంది. ఈ కారణాల పరంపరలే ఈ విశ్వ సామ్రాజ్యాన్ని నడుపుతున్నాయి. వీరి ఈ సిద్ధాంతానికి పునాది రెండు విషయాలు. ఒకటి: "కాకతాళీయం." రెండవది: "కార్యకారణం '( Law of Causation )'

ఈ సిద్ధాంతం చెప్పేదేమిటంటే, నేటికి దాదాపు రెండు లక్షల శత కోట్ల సంవత్సరాలకు పూర్వం విశ్వం ఉనికే లేదు. అప్పుడు నక్షత్రాలూ లేవు. గ్రహాలూ లేవు. కాని వాతావరణంలో పదార్థం ఉండింది. ఈ పదార్థం అప్పుడు ఘనరూపంలో కాకుండా కేవలం అణువుల రూపంలో అంటే, ఎలక్ట్రాన్, ప్రోటాన్ల రూపంలో రోదసి మొత్తంలో సరిసమానంగా వ్యాపించి ఉండేది. అంటే అతి సూక్ష్మాతిసూక్ష్మమైన ఈ అణువులు ధూళి రూపంగా పూర్తి విశ్వంలో నిండి ఉన్నాయి. ఆ సమయంలో పదార్థం ఏ విధమైనటువంటి చలనం లేకుండా పూర్తిగా సమతూక ( Balance ) స్థితిలో ఉంది. గణిత శాస్త్రం దృష్టిలో ఈ సమతూక స్థితికి ఏ మాత్రం అంతరాయం కలిగినా అది నిలకడగా ఉండజాలదు. ఈ అంతరాయాలు పెరుగుతూనే ఉంటాయి. ఒకవేళ ఈ ప్రారంభ అంతరాయాన్ని అంగీకరిస్తే, వారి అభిప్రాయంలో దీని తరువాతి సంఘటనలన్నీ గణిత శాస్త్రీయంగా రుజువైపోతాయి. కాబట్టి అణురూపంలో ఉన్న ఈ ప్రకృతి మేఘాల్లో స్వల్పమైన అంతరాయం కలిగింది. నిశ్చలంగా ఉన్న నీటి కొలనులో ఎవరైనా చేయిపెట్టి కదిలించినట్లు, ప్రశాంత నిలయమైన ఈ విశ్వాన్ని ఎవరు కదిలించారో నిర్దిష్టంగా మనకేమీ తెలియదు. కాని అంతరాయమైతే కలిగింది, అది పెరుగుతూనే పోయింది. దీని ఫలితంగా పదార్థం కదులుతూ వేరు వేరు ప్రాంతాల్లో ప్రోగవటం ప్రారంభమైంది. ఈ విధంగా చేరిన పదార్థాన్నే మనం నక్షత్రాలు, గ్రహాలు, ఉల్కలు అని వ్యవహరిస్తున్నాం.

విశ్వానికి సంబంధించిన ఈ సిద్ధాంతాన్ని సైన్స్ ప్రవేశపెట్టింది కాని వాస్తవం ఏమిటంటే అతి బలహీనమైనటువంటి ఈ సిద్ధాంతం పట్ల స్వయంగా శాస్త్రవేత్తలు సైతం అసంతృప్తిగానే ఉన్నారు. విశ్వాన్ని మొదటిసారి కదిలించిందెవరో తెలియదనే యదార్థాన్ని సైన్స్ అంగీకరిస్తోంది. ఓవైపు తెలియదనే వాస్తవాన్ని అంగీకరిస్తూనే, మరోవైపు విశ్వప్రారంభ రహస్యాలను కనుగొన్నానని వాదిస్తోంది. సైన్స్ దృష్టిలో మొట్టమొదట ఈ విశ్వాన్ని కదిలించిన దాని పేరు – 'కాకతాళీయం'. అయితే ఒక ప్రశ్న : చలనరహిత పదార్థం మినహా మరే వస్తువూ విశ్వంలో లేనప్పుడు, ఈ విశ్వాన్ని కదిలించిన అనూహ్యమైన ఈ కాకతాళీయం ఎలా ఎక్కడ్నుంచి వచ్చింది? దీని కారణాలు పదార్థంలో అంతర్గతంగా కాని, బాహ్యంగా కాని లేనప్పుడు ఆ కాకతాళీయ సంఘటన ఎలా ఉనికిలోకొచ్చింది? ఆసక్తికరమైన, వైరుధ్యపూరిత

ఈ సిద్ధాంతం ప్రకారం, ప్రతి సంఘటనకు ముందు మరో సంఘటన జరగటం తప్పనిసరి. అది ఆ తరువాత జరిగే సంఘటనలకు కారణభూతమవుతుంది. కాని ఈ సిద్ధాంతం ప్రారంభం మాత్రం ఎలాంటి కారణం లేని సంఘటనతో ప్రారంభమవుతుంది – సైన్స్ చెప్పే ఈ ఊహల పునాదులపైన్నే 'కాకతాళీయం' (యాదృచ్ఛికం) అనే సిద్ధాంత నిర్మాణం జరిగింది.

ఇలా ఈ విశ్వం కేవలం కాకతాళీయంగానే ఉనికిలోకి వచ్చినట్లయితే, ఈ సైంటిస్టులు అనుకున్నట్లు ఈ కార్యాలన్నీ గత్యంతరంలేకనే ఈ మార్గాన్ని ఎంచుకున్నాయా? ఇది తప్ప మరే మార్గమూ లేకపోయిందా? నక్షత్రాలు పరస్పరం ఢీకొని నాశనం కాకాపొయ్యాయా? పదార్థంలో చలనం కలిగి, అది కేవలం చలనమే కాకుండా ఇంకా పరిణామక్రమంలో పెరిగిపోవటం అవసరమా? ఆశ్చర్యాన్ని గొలిపే క్రమంలో ప్రస్తుత విశ్వాన్ని ఉనికిలోకి తీసుకొని వచ్చే వైపు పరుగుతీయాలా? అసలు నక్షత్రాలు ఉనికిలోకి రాగానే అనంతమైన ఆ గగనసీమలో ఒ క్రమపద్ధతి ప్రకారం వాటిని విహరింపజేసిన ఆ తర్క సిద్ధాతం ఏది? ఆ తరువాత విశ్వంలోని ఓ సుధూర మూలలో మన సౌరకుంటుబాన్ని  ఉనికిలోకి తెచ్చిన ఆ తర్క శాస్త్రం ఏది? గోళాకారంలో ఉన్న ఈ భూ గ్రహంలో అపూర్వమైన మార్పులు చేసి మానవ మనుగడకు మార్గం సుగమం చేసిన ఆ దివ్యశక్తి ఏది? విశ్వంలోని అనంత గ్రహాల్లో ఏదో ఒక గ్రహంలో జరిగే ఈ అపూర్వమైన మార్పులను గురించి నేటీకి మనం తెలుసుకోలేకపొయ్యాము. అంతేకాదు. ఓ ప్రత్యేక ఘట్టంలో నిర్జీవ పదార్థం నుండి సజీవ ప్రాణికి జన్మనివ్వగలిగిన ఆ సిద్ధాంతం ఏది? ఈ భూ గ్రహంపై జీవితం ఎందుకు, ఎలా ఉనికిలోకి వచ్చింది. ఏ శాసనం (చట్టం) ప్రకారం ఎడతెగకుండా ఈ జీవన వ్యవస్థ సాగిపోతోంది? ఈ విషయాలకు ఏదైనా సహేతుకమైన సమాధానం ఉన్నదా?

అంతేకాదు, ఈ విశ్వంలోని అతి చిన్న భాగంలో మనం సంస్కృతీ నాగరికతల జీవనం గడపటానికి అద్భుతమైన రీతిలో మనకవసరమైన సకల ఏర్పాట్లూ చేసిన ఆ శక్తి ఏది? ఇదంతా కేవలం యాదృచ్ఛికంగా అనుకోని పరిణామాలు జరగటం వల్లనే ఈ సంఘటనలన్నీ అద్భుతమైన రీతిలో ఓ క్రమ పద్ధతి ప్రకారం ఎడతెగకుండా శత, సహస్ర కోట్ల సంవత్సరాలుగా ఈ పరంపర నడుస్తూ కూడా, దీనిలో ఎటువంటి భేదమూ పొడసూపకుండా ఉందా! కేవలం కాకతాళీయంగా జరిగే పరిణామాల్లో ఈ క్రమశిక్షణా గుణం ఎలా వచ్చింది. ఇంతటి ఆశ్చర్యకరమైన పద్ధతిలో, అనూహ్యమైన రీతిలో అభివృద్ధి చెందే అంతటి శ్రద్ధ దీనికి ఎక్కడి నుండి పుట్టుకొచ్చింది? ఈ విషయాలకు సముచితమైన సహేతుకమైన వివరణ ఏమైనా ఉన్నదా?

ఇది విశ్వం ఎలా ఉనికిలోకి వచ్చిందీ? అనే ప్రశ్నకు సమాధానం దీని తరువాత ఉదయించే మరో ప్రశ్న ఏమిటంటే దీన్ని నడిపేదెవరు? మహోన్నతమైన ఈ కర్మాగారాన్ని చక్కని క్రమశిక్షణా పద్ధతిలో నిర్వహించే దెవరు? అనేది. పై సిద్ధాంతంలో ఎవరినైతే సృష్టికర్తగా భావించటం జరుగు తుందో, ఆయన్ని విశ్వానికి అధికారి, శాసనకర్త అని భావించటం కుదరదు. ఈ చక్కని కల్పిత సిద్ధాంతం ఇద్దరు దేవుళ్ళను కోరుతుంది. ఏందుకంటే ప్రారంభ చలనం సిద్ధాంతానికి కాకతాళీయం అనే పేరు సరిపోతుంది. కాని దాని తరువాతి నిరంతరాయ చలనాలను ఎట్టి పరిస్థితిలోనూ కాకతాళీయం అని అనలేము. దీని సిద్ధాంతాల కోసం మరో దేవుని అన్వేషణ తప్పనిసరి.

ఈ చిక్కుముడిని విడదీయటానికి (హేతువాదాన్ని) ( principle of causation )ను ప్రవేశపెట్టటం జరిగింది. అంటే ప్రారంభ చలనాల తరువాత విశ్వంలో సంఘటనల ఓ పరంపర ప్రారంభమయింది. ఈ విధంగా ఒకదాని తరువాత మరొకటిగా పరిణామాలు సంభవిస్తూపోయ్యాయి. పిల్లలు ఏ విధంగానైతే ఇటుకల్ని ఒకదానిపై ఒకటి పేర్చి క్రింది ఇటుకను తీసేస్తే మిగతా ఇటుకలన్నీ వాటంతట అవే ఎలా పడిపోతాయో అలా! సంభవించే ప్రతి సంఘటనకూ కారణం విశ్వం వెలుపల ఎక్కడా కానరాదు. అంతేకాదు అది కేవలం అదుపు లేనటువంటి చట్టాల పరంగా జరిగిన పూర్వపు పరిస్థితుల అనివార్య ఫలితాలు. ఈ పూర్వ సంఘటనలు కూడా వాటికంటే ముందు సంభవించిన సంఘటనల అనివార్య ఫలితాలే. ఈ విధంగా విశ్వంలో హేతువాదం (కార్యకారణాల) అంతంకాని ఓ సుదీర్ఘ పరంపర ప్రారంభమయింది. ఏ పరిస్థితుల్లోనైతే విశ్వప్రారంభం జరిగిందో, అది భావి సంఘటనలను నిర్ణయించే తీర్పునిచ్చింది. ఎప్పుడైతే ఈ ప్రథమ పరిస్థితి ఓ మారు నిర్ణయించబడిందో సృష్టి కూడా ఒకే మార్గంపై తన గమ్యస్థానానికి చేరుకొని ఉండేది. అంటే విశ్వం పుట్టిన రోజునే దాని భావిచరిత్ర కూడా ఆనాడే నిర్ణయించబడిందన్న మాట.

ఈ సూత్రాన్ని (నియమాన్ని) ప్రకృతి మౌలిక చట్టంగా నిర్ణయించటం పదిహేడవ శతాబ్దపు ఓ గొప్ప మలుపు. కాబట్టి ఈ సర్వసృష్టినంతా ఒకే యంత్రంగా రుజువు చేయటానికి ఓ ఉద్యమం ప్రారంభమైంది. పందొమ్మిదవ శతాబ్దాంతానికి ఈ ఉద్యమం తారాస్థాయికి చేరుకుంది. ఈ కాలం సైంటిస్టులు, ఇంజనీర్ల కాలం. వీరు ప్రకృతి యాంత్రిక నమూనాలను చెయ్యాలని కలలు గన్నారు. ఆ కాలంలోనే హెల్మ్‌హోల్ట్జ్ (Helmholtz) అనే ఆయన "ప్రకృతి శాస్త్రాలన్నిటి చివరి ధ్యేయం తమను తాము మెకానిక్స్‌గా రూపొందించు కోవటం" అని చెప్పాడు. అయితే ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వ రహస్యాలన్నింటినీ వివరించటంలో సైంటిస్టులు

ఇంకా విజయం పొందలేదు. కాని వారు దీని వివరణ అంతా యాంత్రికంగానే జరిగిపోతుందని విశ్వసిస్తారు. కేవలం కొంత ప్రయత్నం చాలు, చివరికి ప్రపంచమంతా ఓ నడిచే యంత్రంగా రుజువైపోతుందని వారు భావిస్తారు.

ఈ విషయాల సంబంధం మానవ జీవితంతో ముడిపడి ఉందని నిర్దిష్టంగా తేలిపోయింది. ఈ కార్యకారణ సిద్ధాంత విస్తరణ, ప్రకృతి ప్రతి విజయవంతమైన యాంత్రిక వివరణ మానవ శక్తిపై అపనమ్మకాన్ని సృష్టించింది. ఎందుకంటే ఈ సిద్ధాంతం ప్రకృతినంతటినీ పరివేష్టించి ఉన్నట్లయితే జీవితం అనేది ఈ సిద్ధాంతాల నుండి ఎందుకు మినహాయించబడినట్లు? ఈ ఆలోచనా సరళి ఫలితంగా పదిహేడు, పద్దెనిమిదవ శతాబ్దపు యాంత్రిక తత్వశాస్త్రాలు ఉనికిలోకి వచ్చాయి. జీవకణం (Living Cell ) కూడా ఓ నిర్జీవ పదార్థంవలెనే రసాయనిక అణువులతో నిర్మించబడింది అని తెలిసినప్పుడు, వెంటనే ఓ ప్రశ్న ఉదయిస్తుంది. మన శరీరాన్ని, మెదడును నిర్మించిన ఆ ప్రత్యేకమైన విభాగాలు ఏమిటి? అనేదే ఆ ప్రశ్న. ఇవి కార్యకారణ పరిధిలోకి ఎందుకురావు. కాబట్టి జీవితం కూడా కేవలం ఓ యంత్రమేనని భావించబడటమేకాక దాన్ని సిద్ధాంతీకరించటం కూడా జరిగింది. అంతేకాదు. న్యూటన్, బాఖ్ (Bach ), మైకిల్ ఎంజ్‌లో (Micalan Gelo ) లు అనే ప్రిటింగ్ యంత్రాల్లాంటి మెదళ్ళు కలిగిన ఈ మేధావులు బాహ్యరూపంలో చూసినదాన్నే ఆలోచించి చెప్పేవాళ్ళు.

కాని సైన్స్ కఠినమైన, అసంతులమైన ఈ సిద్ధాంతాన్ని ఇప్పుడు స్వీకరించటంలేదు. సాపేక్షతావాద సిద్ధాంతం కార్యకారణాన్ని ఓ భ్రమ (Illusion) అని అంటుంది. పందొమ్మిదవ శతాబ్దాంతంలోనే అనేక విశ్వరహస్యాలు, ముఖ్యంగా కాంతి, గురుత్వాకర్షణలు యాంత్రిక వివరణ ప్రతి ప్రయత్నాన్ని వమ్ముచేస్తున్నాయని సైంటిస్టులు అర్థం చేసుకున్నారు. న్యూటన్ ఆలోచనలు బాక్, ఎంజ్‌లోల భావాలను తిరిగి ఆచరణలో పెట్టగలమా అని చర్చ జరుగుతున్నప్పుడు సైంటిస్టులకు కొవొత్తి వెలుగు, యాపిల్ పడటాన్ని ఏ యంత్రమూ నిరూపించి చూపలేదు అని తెలుసుకున్నారు. పురాతన శాస్త్రజ్ఞులు ప్రకృతి కేవలం ఒకే ఒక మార్గాన్ని ఎన్నుకుంటుందని, ఇంకా అది కార్యకారణ సిద్ధాతం ప్రకారమే ఆది నుండి అంతం వరకు ఒకే విధంగా నిర్ణయించబడి ఉంటుందని గట్టిగా చాటి చెప్పారు. కాని చివరికి సైంటిస్టులు మొదట అనుకున్నట్లు విశ్వం గతం ఖచ్చితంగా దాని భవిష్యత్తుకు కారణభూతం కాదు అని ఒప్పుకోవలసి వచ్చింది. ప్రస్తుత సమాచార వెలుగులో అత్యధిక సైంటిస్టుల ఓ వర్గం, విజ్ఞానసాగరం మనల్ని ఓ యాంత్రికం కానట్టి (Non Mechanical Reality) యదార్ధం వైపునకు తీసుకువెళుతుంది అనే విషయాన్ని నమ్ముతున్నారు.

శాస్త్ర పురోభివృద్ధితోపాటు ఉనికిలోని వచ్చిన విశ్వజననం, దాని చలనం అనే ఈ రెండు సిద్ధాంతాలు ఇప్పటి వరకు విశ్వాస భాగ్యానికి నోచుకో లేదు. ఆధునిక పరిశీలనలు వాటి పునాదులను గట్టిపరచలేవు సరికదా ఇంకా బలహీనపరుస్తాయి. ఈ విధంగా సైన్సే స్వయంగా ఈ సిద్ధాంతాన్ని రద్దు చేస్తుంది. ఇప్పుడు మళ్లీ మనిషి తన మొదటి స్థానానికే వచ్చాడు. మళ్ళీ మనముందు ఉద్భవించే ప్రశ్న ఈ విశ్వస్థాపకుడెవరు? దీన్ని నడిపే దెవరు? అనేదే.

అంతవరకు అది సృష్టికర్త అన్వేషణకు సంబంధించిన సమస్య. ఆ తరువాత మనిషి తెలుసుకోగోరే రెండవ విషయం, “నా ఆరాధ్యుడెవరు?” అనేది. మనం మన జీవితంలో ఓ ఖాళీ ఉన్నట్లు స్పష్టంగా గమనిస్తాం. కాని ఆ ఖాళీని ఎలా పూరించాలో మనకు తెలియదు. మన జీవితంలో వ్యక్తమయ్యే ఈ శూన్యభావననే నేను “ ఆరాధ్యుని అన్వేషణ” అని పేర్కొన్నాను (వివరించాను). ఈ భావన రెండు కోణాల్లో దర్శనమిస్తుంది.

మన ఉనికిని గురించి, బాహ్య ప్రపంచాన్ని గురించి మనం ఆలోచిస్తే రెండు తీవ్రమైన భావోద్రేకాలు మనలో కలుగుతాయి. మెదటి: కృతజ్ఞత, ఉపకార భావన (షుక్ర్), రెండోది బలహీనత, వినమ్రతా భావన.

మనం మన జీవితపు ఏ కోణాన్ని చూసినా మన జీవితమంతా ఒకరి ఉపకారాలతో కప్పబడి ఉన్నట్లు ప్రస్ఫుటంగా చూడగలం. ఇదిగన్న మనకు మన దాత ఎడల అనంతమైన కృతజ్ఞతాభావం పెల్లుబుకుతుంది. ఫలితంగా మన సర్వస్వాన్ని ఆయనకు సమర్పించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాం. ఈ అన్వేషణ మనకు తాత్వికమైనదేమీకాదు. దీని సంబంధం మన నైజంతో పూర్తిగా ముడిపడి ఉంది. ఈ ప్రశ్న మన బాహ్య సమస్యను పరిష్కరించేదే కాకుండా, ఇది మన అంతర్గత వాంఛ కూడా! మన పూర్తి ఉనికే ఈ ప్రశ్నకు సమాధానం కోరుతోంది.

ఆలోచించండి! వివేకవంతుడైన ఓ మనిషి తాను ఈ విశ్వంలో ఓ శాశ్వత సంఘటన రూపంలో ఉన్నాననేది మరిచిపోగలడా? తన ఉనికికి తన ప్రయత్నాల ప్రమేయం ఏమీ లేదు. అతడు తాను కలిగి ఉన్న ఈ రూపం కంటే మేలైన మరే రూపాన్ని ఇక అతడు ఉహించలేడు. అయినప్పటికీ తన ఈ రూపాన్నీ తాను స్వయంగా నిర్మించుకోలేదు. మరే ప్రాణికి ప్రాప్తం కానటువంటి ఆశ్చర్యకరమైన మేధస్సు ఇతనికి ఇవ్వబడింది. ఆ మేధాశక్తిని పొందటానికి అతడు ఏ ప్రయత్నమూ చెయ్యలేదు, చెయ్యలేడు కూడాను. మన ఉనికి మన సొంతం కాదు.

ఇది ఒక కానుక లాంటిది. మానవనైజం తనకు ఈ కానుకనిచ్చిందెవరు అనే ప్రశ్నకు సమాధానం వెదుకుతోంది. ఎందుకంటే తనపై ఇలాంటి ఉపకారాలను కురింపించిన ఆ మహోన్నత ఉపకారికి కృతజ్ఞతలు తెలుపుకోవటానికి.

ఇక బాహ్య ప్రపంచాన్ని చూడండి. మనం జన్మించినప్పుడు మన వద్ద మనదంటూ ఏదీ ఉండదు. ఈ విశ్వాన్ని మన అవసరాలకనుగుణంగా మలచుకునే అధికారంగాని, శక్తిగాని మనకు లేదు. మన అసంఖ్యాక అవసరాల్లో దేన్నీ మనం స్వయంగా నెరవేర్చుకోలేము. అయినా ఈ ప్రపంచంలో మన అవసరాలను తీర్చేందుకు అద్భుతమైన రీతిలో పూర్తి ఏర్పాట్లు చేయబడి ఉన్నాయని మనం గమనించగలం. ఈ ఏర్పాట్లన్నీ చూస్తుంటే, మనిషి పుట్టగానే అతని ఊడిగం చెయ్యాలని ఈ విశ్వం తన అన్ని హంగులతో ఏదురుచూస్తోందా! అని అనిపిస్తుంది. ఉదాహరణకు ఒక శబ్దాన్నే తీసుకోండి. దాని ద్వారా మనం మన భావాలను మరొకరికి అందజేస్తాం. మన మేధలో ఉత్పన్నమయ్యే భావాలు మన నాలుక శబ్ద తరంగాలుగా మారి, మరొకరి చెవి దాకా చేరి వాటిని అర్థమయ్యే రీతిలో వినిపింపజెయ్యటం ఎలా సంభవ మైంది? అందుకోసం మనలోనూ, మన బాహ్యంలోనూ అనేక ఏర్పాట్లు చేయబడ్డాయి. ఆ ఏర్పాట్లలోని ఒక మాధ్యమాన్ని మనం గాలి అని అంటున్నాం. మనం మాట్లాడే మాటలు శబ్దరహిత తరంగాలుగా, నీటి ఉపరితలంపై ఏర్పాడే అలలుగా గాలిలో ముందుకు సాగిపోతాయి. నా నోటి నుండి వెలువడిన శబ్దం మీదాకా చేరాలంటే నడుమ గాలి ఉండటం ఎంతైనా అవసరం. ఒకవేళ ఈ మధ్యమమే లేకపోతే మీరూ నా పెదాలు కదలటం మాత్రమే చూస్తారు. కాని శబ్దాన్ని వినలేరు. ఉదాహరణకు పూర్తిగా మూసి ఉన్న ఓ గాజుపెట్టెలో విద్యుత్ గంటను పెట్టి మ్రోగిస్తే దాని శబ్దం పూర్తిగా మనకు వినబడతుంది. కాని ఆ గాజు పెట్టెలోని గాలిని పూర్తిగా తీసివేసి గంటను మ్రోగిస్తే మీరు ఆ పెట్టెలో గంట కొట్టుకోవడం చూస్తారు కాని దాని శబ్దం మాత్రం మీకు వినపడదు. ఎందుకంటే గంట మ్రోగగా ఏ శబ్ద తరంగాలైతే ఉత్పన్నమవుతాయో ఆ తరంగాలను తీసుకొని మీ చెవుల దాకా చేర్చే గాలి ఆ గాజు పెట్టెలో లేదు. కాని ఈ పద్ధతి కూడా అసంపూర్ణమైన పద్ధతే. ఎందుకంటే గాలి ద్వారా మన శబ్దం ఐదు సెకనులలో కేవలం ఒక మైలు మాత్రమే ప్రయాణించగలుగుతుంది. అంటే ఈ గాలి ద్వారా మనం కేవలం మన దరిదాపు పరిసరాల్లో మాత్రమే మాట్లాడుకోగలం. ఇది మన శబ్దాన్ని చాలా దూరం వరకు పంపించలేదు. ఒక వేళ ఈ శబ్దం కేవలం గాలి ద్వారానే వ్యాప్తి జరిగితే ఆ శబ్దాన్ని మరో చోటికి చేర్చటం దానికి సాధ్యం కాకపొయ్యేది. కాని ప్రకృతి మన కోసం అతివేగమైన మరో మాధ్యమాన్ని సమకూర్చిపెట్టింది. అదే కాంతి, లేక విద్యుత్తరంగం. దీని వేగం సెకనుకు ఒక లక్షా ఎనభై ఆరువేల మైళ్ళు. వైర్‌లెస్ వార్తలు ఈ మాధ్యమం ద్వారానే పంపబడతాయి. ఓ ఉ

పన్యాసకుడు రేడియో స్టేషన్‌లో ఉంచబడిన మైక్రోఫోను దగ్గర మాట్లాడితే, మైక్రోఫోను ఆ శబ్దాన్ని గ్రహించి దాన్ని విద్యుత్తరంగాలుగా మార్చివేస్తుంది. ఆ తరంగం వైరు ద్వారా ట్రాన్స్‌మీటరకు చేరుతుంది. ప్రసార యంత్రాలు శబ్దం చేరగానే ప్రకపించి గాలిలో ఆ ప్రకంపనలనే పుట్టిస్తాయి. ఈ విధంగా ఐదు సెకనులలో ఒక మైలు ప్రయాణం చేయగలిగే శబ్దం విద్యుత్తరంగాల్లోకి మారి ఒక సెకనులో దాదాపు రెండు లక్షల మైళ్ళ వేగం పుంజుకుంటుంది. ఒక్క క్షణంలో అది పూర్తి ప్రపంచంలో వ్యాపించి పోతుంది. మన రేడియో సెట్టులోని శబ్ద గ్రహణ యంత్రం గ్రహించి వాటిని రిపీట్ చేసే వైర్‌లెస్ తరంగాలే ఈ శబ్దం. దీనిద్వారా మనం వేలకొలది మైళ్ళ దూరంలోని శబ్దాలను కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా అప్పటికప్పుడే వినగలుగుతాం. ఈ ఏర్పాటు నేను చెప్పని అనేక ఏర్పాట్లలో ఒకటి మాత్రమే. ఒకవేళ దాని గురించి, ఇతర ఏర్పాట్లను గురించి వివరంగా చెప్పదలిస్తే దానికోసం వేలాది పేజీలు అవసరమవుతాయి. అయినా వాటి వివరాలు మాత్రం అంతం కావు.

మనిషికి సతతం లభించే ఈ కానుకలు లేకపోతే భూమ్మీద మానవ జీవితం, నాగరికతలను గురించి ఊహించటం కూడా కష్టమయ్యేది. తన కోసం ఇవన్నీ ఎవరు ఏర్పాటు చేశారో మనిషి తెలుసుకోదలుస్తాడు. సతతం ఏదో ఒక వరం అతనికి లభించినప్పుడు అతని హృదయంలో అప్రయత్నంగా అనిర్వచనీయమైన కృతజ్ఞతాభావం పెల్లుబుకుతుంది. తనపై ఇంతటి అపూర్వ ఉపకారాలు చేసినదెవరో తెలుసుకొని ఆయన పాదాలపై పడటానికి ఎంతగానో ఆరాటపడతాడు. ఆయన ఉపకారాలను విశ్వసించటం, హృదయాంతరాళంలో ఆయన్ను నిలపడం, ఆయన సేవలో తన అత్యుత్తమ భావోద్రేకాలను సమర్పించటం అనేది మానవ నైజంలో నిక్షిప్తమై ఉన్న అతి శ్రేష్టమైన భావన. తన జీవితం గురించి, విశ్వం గురించి లోతుగా ఆలోచించే ప్రతి మనిషిలో పై భావన తప్పకుండా ఉత్పన్నమవుతుంది. అయితే ఈ భావనకు ఏమీ సమాధానం లేదా? మనిషి ఈ విశ్వంలో ఓ అనాథ బాలుడా? అతని హృదయాంతరాళంలో పెల్లుబికే ప్రేమ భావాలను తృప్తిపరిచేందుకు ఏ శక్తీ లేదా? ఉపకారాలైతే ఉన్నాయికాని ఆ ఉపకారి ఉనికే లేనటేవంటి విశ్వమా ఇది? భావోద్రేకమైతే ఉన్నదికాని, ఆ భావోద్రేకాలను చల్లబరిచే ఏ మార్గమూ లేదా?

ఇది ఆరాధ్యుని అన్వేషణ గురించిన ఓ కోణం. దీని మరో దృష్టికోణం ఏమిటంటే ఈ విశ్వంలో మనిషికి ఓ ఆధారం ఉండాలని అతని పరిస్థితులు సహజంగా కోరతాయి. మనంగనక నిశితంగా పరిశీలించినట్లయితే మనం ఈ ప్రపంచంలో వివశులమైన ప్రాణులం అని తెలుతుంది. కాస్త ఆ రోదసి గురించి ఉహించండి! దీనిలో మన భూమి సూర్యుని చుట్టూ

ప్రరిభ్రమిస్తూ ఉంటుంది. భూమి చుట్టుకొలత దాదాపు పాతిక వేల మైళ్ళు అని మీకు తెలుసు. ఇది గుండ్రంగా తిరిగే బొంగరం మాదిరిగా తన అక్షంపై నిరంతరం ప్రతి ఇరవై నాలుగు గంటల్లో ఓసారి పరిభ్రమిస్తుంది. అంటే దాని వేగం గంటకు వెయ్యి మైళ్ళన్న మాట. దీనికి తోడు అది సూర్యుని చుట్టూ పద్దెనిమిది కోట్ల అరవై లక్షల మైళ్ళు పొడవుగల కక్ష్యలో అతి వేగంగా పరుగెత్తుతోంది.

రోదసిలో ఇలా వేగంగా పరుగెత్తే భూమిపై మన ఉనికిని నిలబెట్టటా నికి ఆ భూమి వేగాన్ని ఒక క్రమపద్ధతిలో ఉంచటం జరిగింది. అలా జరక్కపోతే ఈ భూమ్మిద మనిషి పరిస్థితి గుండ్రంగా తిరితే చక్రంపై ఉంచబడిన ఇసుక రేణువు మాదిరిగా ఉండేదే! దీనికి తోడు భూమ్యాకర్షణ శక్తి మనల్ని తన వైపు లాక్కోవటమేకాక, పైనుండి గాలి పీడనం మనపై పడుతుంది. గాలి ద్వారా ఏ పీడనమైతే మనపై పడుతుందో అది మన శరీరపు ప్రతి చదరపు అంగుళంపై ఏడున్నర సేర్లు ఉందని కనుగొనబడింది. అంటే ఓ సగటు మనిషి శరీరంపై దాదాపు రెండు వందల ఎనభై మణుగుల పీడనం ఉందన్న మాట. ఈ అద్భుతమైన ఏర్పాట్లే మనల్ని రోదసిలో నిరంతరం పరుగెత్తే భూమిపై అన్నవైపుల నుండి ఎటూ పడిపోకుండా నిలకడగా ఉంచాయి.

ఇక సూర్యుడి గురించి కాస్త ఆలోచించండి. సూర్యుని ఆకారం ఎనిమిది లక్షల అరవై ఐదు వేల మైళ్ళు. అంటే ఇది మన భూమికంటే పదిలక్షల రెట్లు పెద్దదన్న మాట. ఈ సూర్యుడు అగ్నితో మండే ఓ పెద్ద సముద్రం లాంటిది. దాని దగ్గరగా వచ్చే ఏ వస్తువూ ఘన రూపంలో ఉండ జాలదు. భూమికీ సూర్యునికీ మధ్య ఉన్న దూరం ప్రస్తుతం దాదాపు తొమ్మిదిన్నర కోట్ల మైళ్ళు, ఇలా కాకుండా సూర్యుడు దానికి సగం దూరంలో ఉంటే ఆ సూర్యుని వేడిమికి కాగితంలా కాలిపోతుంది. అదే ఇప్పుడు చంద్రుడున్న స్థలంలో అంటే రెండు లక్షల నలభై వేల మైళ్ల దూరానికి వచ్చేస్తే ఈ భూమి కరిగి అవిరైపొయ్యేది. నేడు భూమిపై ఉన్న దృశ్యాలు, అందచందాలన్నీ ఈ సూర్యుని వల్లనే. దీనికోసమే దాన్ని ఓ ప్రత్యేక దూరంలో ఉంచటం జరిగింది. అదే మరింత దూరం వెళ్లిపోతే భూమి మంచులా గడ్డకట్టేది. అదే మరింత దగ్గరగా వచ్చేస్తే మనమంతా మాడి మసైపొయ్యే వాళ్లం.

తరువాత ఈ విశ్వ వైశాల్యాన్ని చూడండి. ఈ మహోన్నత విశ్వానికి ఆధారభూతమైన గురుత్వాకర్షణ శక్తిని గురించి కాస్త ఆలోచించండి. విశ్వం అనంతమైన దూరాల్లో వ్యాపించి ఉన్న ఓ కర్మాగారం లాంటిది. ఖగోళ శాస్త్రజ్ఞుల దృష్టిలో విశ్వవైశాల్యపు అంచనా ఏమిటంటే సెకనుకు ఒక లక్షా ఎనభై ఆరువేల మైళ్లు ప్రయాణించే కాంతి విశ్వాన్ని ఒకసారి చుట్టి

రావటానికి అనేక శతకోట్ల సంవత్సరాలు పడుతుంది. ఈ సూర్యకుటుంబం చూడటానికి చాలా పెద్దదిగా గోచరిస్తుంది. కాని పూర్తి విశ్వంతో పోలిస్తే దీనికసలు విలువే లేదు. విశ్వంలో ఇంతకంటే పెద్దవి అనేక నక్షత్రాలు అనంత దూరాల్లో వ్యాపించి ఉన్నాయి. వాటిలో కొన్నిటిపైనైతే మన పూర్తి సూర్యకుటుంబాన్నే పెట్టవచ్చు. ఏ గురుత్వాకర్షణ శక్తి అయితే ఈ అసంఖ్యాక ప్రపంచాలను సంబాళిస్తూ ఉందో దాని ఔన్నత్యాన్ని ఊహించటానికి ఈ ఉపమానం చాలు. అదేమిటంటే సూర్యుడు మన భూమిని తన అనంతమైన శక్తితో తనవైపు లాక్కుంటూ దాన్ని ఈ సువిశాలమైన రోదసిలో పడిపోయి నాశనం కాకుండా కాపాడుతుంది. కంటికి కానరాని ఈ శక్తి ఎంత బలమైందంటే ఈ పని కోసం ఏదేని పదార్థముతో భూమిని కట్టి ఉంచితే, భూమిపైని పచ్చిక భూమిని కప్పేసినట్లుగా ఆ కట్టిన పదార్థపు తీగలతో ఈ భూగ్రహమంతా నిండిపొయ్యేది.

మన జీవితం మన ఆధీనంలో లేదు. మనపై ఎంతో ప్రేమాను రాగాలు కురిపించే 'శక్తి' చేతుల్లో ఉంది. మానవ మనుగడ కోసం ప్రపంచంలో ఎటువంటి ఏర్పాట్లు ఉన్నాయంటే అవి లేకుండా మానవ జీవితాన్ని ఊహించటం కూడా కష్టమైపోతుంది. ఆ ఏర్పాట్లు ఎంత ఉన్నత స్థాయిలో జరుగుతున్నాయంటే వాటిని ఉనికిలోకి తేవటానికి ఎన్నో అసాధారణమైన మార్పులు అవసరమవుతున్నాయి. మానవుడు వీటిని గురించి కనీసం ఊహించనైనాలేడు. సృష్టితాల కోసం ఏ ఆచరణావిధానమైతే నిర్ణయించబడివుందో, దాన్ని నిర్ణయించటం తరువాత సంగతి. కనీసం దానిపై అదుపు (Control) సాధించటం కూడా అతని వల్ల అయ్యే పని కాదు.

ఈ విశ్వంలో మనిషి తన ఉనికిని ఎంత నికృష్టంగా భావిస్తాడంటే, సముద్రపు అలలపై కొట్టుకుపోయే ఓ చీమ తనను రక్షించుకోవటానికి ఎంతగా ప్రయత్నిస్తుందో, ఆ చీమకంటే కూడా అల్పంగా, బలహీనమైనవాడిగా భావిస్తాడు. ఈ విశాల విశ్వంలో తనకు సహకరించటానికి ఎవరైనా తప్పకుండా ఉండాలని అతడు అప్రయత్నంగా కోరుకుంటాడు. ఇంకా అతడు ఈ విశ్వాధికారాలను తన గుప్పెట్లో ఉంచుకోగల ఓ శక్తి సహాయాన్ని అన్వేషిస్తాడు. ఆ మహాశక్తి ఆశ్రయంలోనే తనకు రక్షణ లభించగలదని, అప్పుడే తాను సురక్షితంగా ఉండగలనని భావిస్తాడు.

ఈ రెండు భావనలకే నేను "ఆరాధ్యుని అన్వేషణ" అనే శీర్షిక పెట్టాను. ఆరాధ్యుని అన్వేషణ అనేది అసలు ఒక ప్రకృతి నైజం. అంటే మనిషికి ప్రేమ, ఆశ్రయాలను కల్పించే ఓ కేంద్రీయ శక్తి అన్వేషణ అన్నమాట. ప్రస్తుతకాలంలో మానవుని ఈ ప్రశ్నకు జవాబుగా జాతి,

దేశం, రాష్ట్రాలను ప్రవేశపెట్టటం జరిగింది. పాశ్చాత్య నాగరికత ఏమంటోందంటే మన జాతి, మన రాష్ట్రం, మన దేశాలు మీ విశ్వాసాల కేంద్రం కాగలిగేటంత స్థానం వాటికివ్వండి. దానితో అనుబంధం ద్వారానే మీరు రక్షణ పొందగలరు. ఈ విషయాలను ఆరాధ్యుని పేరుతో ప్రవేశపెట్టటం సాధ్యపడదు. కాని జీవితంలో వారికి ఏ స్థానమైతే ప్రసాదించబడిందో దాదాపుగా అది ఓ ఆరాధ్యుడు కావాలి అనేదే. కాని ఆ విషయాలకు ఆరాధ్యుని స్థానమివ్వటం ఎలాంటిదంటే ఎవరికైనా ఓ జీవిత సహచరిణి అవసరమైతే, ఆ స్థానంలో అతని సేవ కోసం ఓ శిలను జీవిత భాగస్వామిగా ప్రవేశపెట్టడం లాంటిది. దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే మనిషిలో ఏదైతే అన్వేషణ అనే భావోద్రేకం పెల్లుబుకుతుందో, దాని కారణాలు మానవుని హృదయాంతరాళంలో వ్యాపించి ఉన్నాయి. అంటే విశ్వం మొత్తాన్నీ పరివేష్టించి ఉన్న ఓ శక్తి అన్వేషణలో అతడున్నాడన్న మాట. దీనికి సమాధానం ఏ భూగోళ శాస్త్రంలోనో దొరకదు. ఈ శాస్త్రాలు మహాఅయితే ఓ సమాజ నిర్మాణంలో కొద్దో గొప్పో తోడ్పడతాయి, అంతేకాని "ఆరాధ్యుని అన్వేషణ" విషయంలో మాత్రం అవి మానవుని భావోద్రేకాలను తృప్తిపరచలేవు. దీనికోసం విశ్వఉనికి ఎంతైనా అవసరం. మనిషికి తాను కేంద్రీయ శక్తిగా భావించి ప్రేమించటానికి భూమ్యాకాశాలను సృష్టించిన ఓ శక్తి ఉనికి కావాలి. తన రక్షణ కోసం ఈ విశ్వ వ్యవస్థపై పూర్తి అధికారం కలిగిన ఓ శక్తిని అతడు అన్వేషిస్తున్నాడు. అటువంటి ఓ ఉనికిని అతడు పొందనంతవరకూ అతని జీవితంలో మరే వస్తువూ పూరించలేనటువంటి ఖాళీ ఏర్పడి ఉంటుంది.

సత్యాన్వేషణ (మూలాన్వేషణ) మూడవ కోణం ఏమిటంటే, "తన పరిణామ అన్వేషణ". మనిషి తాను ఎక్కడి నుండి వచ్చిందీ, ఎక్కడికి పోవలసి ఉందో? అనే విషయాలను తెలుసుకోవాలనుకుంటాడు. తనలోని శక్తియుక్తుల్ని, మనోకాంక్షల్ని ఎలా తృప్తిపరచాలో అది కూడా తెలుసుకోవాలను కుంటాడు. అతడు అతిస్వల్పమైన ఈ ప్రస్తుత జీవితానికి బదులుగా ఓ సుదీర్ఘమైన జీవితం ప్రాప్తమైతే ఎంత బాగుండు! అని కోరుకుంటాడు. కాని అతడు దేన్ని ఎక్కడ పొందగలడో అది అతనికి తెలియదు. అతనిలో ఉన్నటువంటి ఎన్నో నైతిక విలువలు, మానవత్వపు భావాలు ఈ ప్రపంచంలో కాలరాయబడుతున్నాయి. ఫలితంగా అతని మేధలో ఈ విషయాలకు విలువనిచ్చే, నాకిష్టమైన ప్రపంచాన్ని పొందలేనా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ ప్రశ్నలు మానవుని హృదయాంతరాళాల్లో ఎలా పొంగుతాయో, విశ్వ పరిశీలన అతని మనసులో ఈ ప్రశ్నలను ఎలా రేకెత్తిస్తుందో ఈ సందర్భంలో కాస్త వివరించటం సముచితం అని భావిస్తున్నాను.

జీవశాస్త్ర నిపుణుల ప్రకారం మానవుడు ప్రస్తుత రూపంలో మూడు లక్షల సంవత్సరాల

నుండి ఈ భూమిపై ఉన్నాడు. దీనికి భిన్నంగా విశ్వ అయుష్షు చాలా ఎక్కువ. అంటే రెండు లక్షల శతకోట్ల సంవత్సరాలన్న మాట. అంతకు ముందు విశ్వం విద్యుత్ రేణువుల ఓ ధూళి రూపంలో ఉండేది. తరువాత దానిలో చలనం కలిగింది. పదార్ధం సంకుచితమైపోయి విభిన్న స్థలాల్లో పోగవ్వటం ప్రారంభించింది. ఈ విధంగా అక్కడక్కడ చేరిన పదార్థాన్నే మనం నక్షత్రాలు, గ్రహాలు, ఉల్కలు అని అంటున్నాం. ఈ పదార్థపు ముక్కలే గ్యాసుతో నిండిన భయంకర బంతి రూపంలో మన ఊహకందని ఓ సుదీర్ఘకాలంపాటు రోదసిలో పరిభ్రమిస్తూ ఉండేవి. దాదాపు రెండు శతకోట్ల సంవత్సరాలకు పూర్వం విశ్వంలోని ఓ పెద్ద నక్షత్రం రోదసిలో ప్రయాణిస్తూ సూర్యుడికి దగ్గరగా వచ్చేసింది. అప్పుడు సూర్యుడు ఇప్పటికంటే చాలా పెద్దగా ఉన్నాడు. చంద్రుడిని ఆకర్షణ శక్తి ద్వారా సముద్రంపై పెద్ద పెద్ద అలలు ఏ విధంగా లేస్తాయో, అలాగే ఆ నక్షత్రం ఆకర్షణ వల్ల సూర్యునిపై ఓ పెద్ద తుఫాను చెలరేగింది. బలిష్టమైన అలలు పుట్టాయి. అవి క్రమేణా పెరిగిపొయ్యాయి. ఆ నక్షత్రం సూర్యునికి దూరంగా జరగకముందే అవి బాగా పెరిగిపొయ్యాయి. దాని ఆకర్షణ శక్తి ఎంతగా పెరిగిపోయిందంటే సూర్యుని బలీయమైన ఆ గ్యాస్ అలలు ముక్కలై ఒక్క కుదుపుతో ఎక్కడో శూన్యంలో కలిసిపొయ్యాయి. ఇవే తరువాత చల్లారి సౌరకుంటుంబంలోని గ్రహాలుగా మారాయి. ప్రస్తుతం ఈ గ్రహాలన్నీ సూర్యుని చుట్టూ తిరుగుతున్నాయి. మనం నివసించే ఈ భూమి దానిలో భాగమే.

ప్రారంభదశలో భూమి ఓ అగ్నికణం రూపంలో సూర్యుని చుట్టూ తిరుగుతూ ఉండేది. కాని తరువాత వాతావరణంలో క్రమంగా ఉష్ణోగ్రత తగ్గిపోవటం కారణంగా చల్లబడటం ప్రారంభమైంది. ఈ విధంగా కోట్ల సంవత్సరాలు గడవటం వల్ల అది పూర్తిగా చల్లబడిపోయింది. కాని సూర్యుని వేడిమి మాత్రం భూమిపై పడుతూనే ఉంది. ఈ కారణంగా వాయువులు లేచి మేఘాల రూపంలో వాతావరణంలో పరుచుకుపొయ్యాయి. తరువాత ఈ మేఘాలు వర్షించి భూమండలమంతా నీటితో నిండిపోయింది. భూమి ఉపరితలం ఒకవేళ చ్లబడిపోయినా దానిలోపలి భాగం మాత్రం వేడిగానే ఉండవచ్చు. దీని ఫలితంగా భూమి కుంచించుకుపోయింది. ఈ కారణంగా భూమి లోపలి ఉష్ణవాయులపై తీవ్ర ఒత్తిడి పడింది. ఆ వాయువులు బయటికి విడుదలవ్వటానికి ఎంతగానో ప్రయత్నించటం వల్ల క్రమక్రమంగా భూమి బీటలు వారింది. అక్కడక్కడ పెద్దపెద్ద పగుళ్ళు సంభవించాయి. ఈ విధంగా జలప్రళయాలు, భయంకర భూకంపాలు మరియు అగ్ని ప్రమాదాల పరంపరలతో వేల సంవత్సరాలు గడిచిపొయ్యాయి. ఈ భూకంపాల కారణంగానే భూమి కొంత భాగం పైకి పొంగి వచ్చింది. మరి కొంత భాగం లోనికి కుంగిపోయింది. లోనికి కుంగినటువంటి ఆ భాగాల్లో నీరునిండి అవే సముద్రాలుగా రూపుదాల్చాయి. పైకి పొంగిన భాగాలు పెద్ద పెద్ద భూఖండాలుగా అవతరించాయి. కొన్ని

సందర్భాల్లో సంభవించిన ఈ పొంగుల వల్ల పెద్ద పెద్ద ఒడ్లు ఏర్పడ్డాయి. ఇవే ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి గుట్టలు.

గణిత శాస్త్ర నిపుణుల ప్రకారం, ఈ భూగ్రహంపై ప్రాణి (జీవితం) అనేది ఉనికిలోకి వచ్చి, ఒక శతకోటి ఇరవై మూడుకోట్ల సంవత్సరాలైంది. అప్పుడు ఈ ప్రాణులు చిన్న చిన్న కీటకాల రూపంలో నీటి తీరాలపై ఉనికిలోకి వచ్చాయి. వీటి తరువాత వివిధ రకాల జంతువులు పుడుతూ చనిపోతూ ఉండేవి. వేల సంవత్సరాల వరకూ భూమ్మీద కేవలం జంతువులే ఉండేవి. దీని తరువాత సముద్రతీరాల్లో తీగలు, పొదలు ప్రత్యక్షమయ్యాయి. మెట్టభూమిలో కూడా పచ్చిక మొలవటం ప్రారంభమైంది.

ఈ విధంగా చాలా కాలంవరకు అసంఖ్యాక సంఘటనలు వెలుగుచుశాయి. మానవ మనుగడకు పరిస్థితులు అనుకూలించాయి. అప్పుడు మానవుడు పుట్టాడు.

ఈ సిద్ధాంతం ప్రకారం మానవ సృష్టి ప్రారంభం గత మూడు లక్షల సంవత్సరాల అతిస్వల్ప కాలంలో జరిగింది. విశ్వం ఏ కాలవ్యవధినైతే నిర్ణయించిందో దానిముందు మానవ చరిత్ర రెప్పపాటు కాలంకన్నా ఎక్కువేమీ కాదు. మనం ఓ మానవుడి జీవితకాలాన్నే గనక తీసుకుంటే అతని సగటు ఆయుష్షు నూరేళ్ళకన్నా తక్కువే అని మనకు తెలుసు. ఒకవైపు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, మానవునికంటే మేలైన ఉనికి ఈ విశ్వంలో ఏదైనా ఉన్నదా? అనే యదార్థాన్ని గురించి అలోచించండి! శత, సహస్ర కోట్ల భూమ్యాకాశాల భ్రమణం తరువాత ఉనికిలోకి వచ్చిన అత్యుత్తమమైన ప్రాణి (జీవి) మానవుడు మాత్రమే! కాని, ఈ అద్భుతమైనటువంటి మానవుడు, విశ్వవ్యవస్థలోని సకల సృష్టి రాసులపై సంపూర్ణ అధికారం కలిగిన ఈ శ్రేష్టుని జీవితం కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే. మన ఉనికి ఏ ప్రకృతి భాగాలతో నైతే ముడిపడి ఉందో దాని వయసు శత, సహస్ర కోట్ల సంవత్స రాలా? ఇంకా అది మన మరణానంతరం కూడా అలాగే ఉండటమా? ఆ పదార్థ భాగాల మిశ్రమం వల్ల ఉనికిలోకి వచ్చే ఈ మహోన్నత ప్రాణి కేవలం నూరేళ్ళే బ్రతకటమా? కేవలం మానవుడి కోసమే సృష్టించబడిన ఈ విశ్వంలో అతని వయసు (జీవితం) ఇంత స్వల్పమా? సుదీర్ఘమైన ఈ కాలచరిత్రలో అసంఖ్యాకమైన సంఘటనలు ఓ మానవుణ్ణి కేవలం కొన్ని రోజుల కొరకే పుట్టించి, చంపెయ్యటానికే పదిలపరిచబడి ఉన్నాయా?

నేడు ఈ భూమ్మీద నివసించే మానవులంతా ఆరడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, ఒక అడుగు లావు కలిగి ఉంటారు. ఇంత పెద్ద జనసముద్రాన్నీ, ఒక మైలు పొడవు,

ఒక మైలు ఎత్తు కలిగిన ఓ పెట్టెలో సునాయసంగా పెట్టెయ్యవచ్చు. ఈ మాట ఆశ్చర్యంగానే అనిపించినా వాస్తవం మాత్రం ఇదే. తరువాత ఈ పెట్టెను ఏ సముద్రపు ఒడ్డుకో చేర్చి చిన్నగా నెట్టేస్తే ఆ పెట్టె నీటి అడుగు భాగానికిపోయి పడుతుంది. శతాబ్దాలు గడిచిపోయినా, ఈ మానవ సంతతి తమకు చుట్టబడిన శవ వస్త్రాల్లో శాశ్వతంగా అలాగే పడి ఉంటారు. ఒకప్పుడు మానవ జాతికి చెందిన సంతతి ఇక్కడ నివసించిందన్న విషయం ఏ ప్రపంచ మేధకూ అంతుబట్టదు. సముద్ర ఉపరితలాల్లో పద్ధతి ప్రకారం జలప్రళయాలు వస్తూనే ఉంటాయి, సూర్యుడు ఇదేవిధంగా మెరుస్తూనే ఉంటాడు, భూమి తన అక్ష్యంపై నియమబద్ధంగా పరిభ్రమిస్తూనే ఉంటుంది. విశ్వంలోని సుదూర ప్రాంతాల్లో వ్యాపించి ఉన్న అసంఖ్యాక దేశాలు ఇంతటి ఘోర విపత్తును ఓ మామూలు విషయం కంటే కూడా అల్పంగా భావిస్తాయి. శతాబ్దాల తరువాత ఓ ఎత్తయిన మట్టి కుప్ప, తన నోటితో, “ఇది మానవ సంతతి సమాధి. ఇక్కడ వీరు శతాబ్దాలుగా ఓ చిన్న పెట్టెలో పాతి పెట్టబడి ఉన్నారు” అని చెపుతుంది.

మానవుని విలువ కేవలం అంతేనా? పదార్థాన్ని కొట్టండి, తిట్టండి, కాల్చండి, ఏమైనా చెయ్యండి. అది అంతమైపోదు. ఎట్టి పరిస్థితిలోనూ అది తన ఉనికిని నిలబెట్టుకుంటుంది. కాని, మానవుడు ఆ పదార్థంకంటే కూడా ఉన్నతుడే, అతనికి తన ఉనికిని నిలబెట్టుకునే భాగ్యమే లేదా? మరీ మానవుని పరిస్థితి అంతగా దిగజారిపోయిందా? ఈ విశ్వ వ్యవస్థ పరమార్థమే మనిషి! అటువంటి మానవ జీవితానికి విలువే లేదా? దాన్ని అంత తొందరగా అంతం చెయ్యటానికి. మానవ జీవితం పరాకాష్ట, ఈ విశ్వంలో ఓ చిన్న భూభాగంపై కేవలం కొద్ది రోజుల కోసమే పుట్టి నాశనమైపోవటమేనా? మన విజ్ఞానం, మన అభ్యుదయాల సంఘటనలన్నీ మనతోపాటే శాశ్వతంగా అంతమైపోయి మానవ సంతతి అనబడే జాతి ఏదీ ఈ విశ్వంలో ఉనికిలో లేదు అనే విధంగా ఎలాంటిదలాగే ఉంటుందా. ఈ సందర్భంలో మనకు తెలిసే రెండవ విషయం ఏమిటంటే, ఒకవేళ ఈ ప్రపంచ జీవితమే అసలే జీవితమైతే ఈ స్వల్ప జీవన వ్యవధిలో మన కోరికలు, ఆశలు (కాంక్షలు) ఫలించలేవు. ప్రతి మానవుడూ అంతం కానటువంటి ఓ సుదీర్ఘకాలం వరకూ జీవించి ఉండాలని కోరుకుంటాడు. చావును ఏ మనిషీ కోరుకోడు. కాని ఈ ప్రపంచంలో పుట్టే ప్రతి వాడికీ, తనకు ఇటువంటి జీవితం అసాధ్యమని తెలుసు. మనిషి సుఖపడాలని కోరుకుంటాడు. ప్రతి మనిషీ తాను ఏ విధమైనటువంటి కష్టాలు, కడగండ్లు లేకుండా సుఖసంతోషాల జీవనం గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాడు. కాని వాస్తవంగా ఏ మనిషైనా ఇటువంటి జీవితం గడపగలడా! ప్రతి మనిషీ చివరి నిమిషం వరకూ తన శక్తిసామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోవటానికి అవకాశం దొరకాలని కోరుకుంటాడు. అతడు తన కోరికలనన్నిటినీ

ఆచరణాత్మకంగా చూడదలుచు కుంటాడు. కాని ఈ పరిమిత కాలంలో అతడు ఈ విధంగా చెయ్యలేడు. మనం ఏవయితే కోరుకుంటున్నామో ఈ విశ్వం దానికి ఏ మాత్రం అనుకూలి స్తున్నట్లు కనబడటంలేదు. అది ప్రతి నాలుగడుగుల తరువాత మన దారికి అడ్డమొచ్చి నిలబడుతుంది. విశ్వం కేవలం పరిమితంగానే మనకు తోడ్పడుతుంది. తరువాత అది మనల్ని నిరాశ, నిస్పృహల వైపునకు నెట్టివేస్తుంది.

మానవ జీవితం కేవలం పొరపాటుగా తన కోసం సృష్టించబడినటు వంటి ఓ విశ్వంలోకి దారితప్పిందా? అనే ప్రశ్న ఇప్పుడు ఉదయిస్తుంది. మానవ జీవితం తనకు ప్రత్యక్ష సంబంధం కలిగినదాని పట్ల అంత అజాగ్రత్తగా ఉందా? మన భావోద్రేకాలు, కోరికలు అంత విలువలేనివా, ప్రపంచంతో ఏ విధమైనటువంటి సంబంధం లేకపోవటానికి? మన అమూల్యమైన భావనలు విశ్వమార్గం నుండి దారితప్పాయా? మన మేధల్లో పిచ్చి పిచ్చి విధానాలు మొలకెత్తాయి. ఎన్నో ఆశలతో మానవ సంతతి గత వేల సంవత్సరాల నుండీ వాటిని తన హృదయంలో దాచుకుని వాటిని సాధించకుండానే అలాగే మట్టిలో కలిసిపోతుంది. మరి ఈ విషయాలకు ఏమీ గమ్యం లేదా? ఇవి మానవుల మనసుల్లో అలాగే ఉద్భవిస్తూ ఉంటాయా? వీటికి గతంలో ఏదైనా పునాది అనేది ఉండిందా, లేక భవిష్యత్తులోనైనా ఏదైనా స్థానం ఉంటుందా?

ఈ సృష్టి మొత్తంలో కేవలం ఒక్క మానవ ఉనికే రేపటి (Tomorrow) గురించి ఆలోచిస్తుంది. ఇది కేవలం మానవుని ప్రత్యేకత. అతను భవిష్యత్తును గురించి ఆలోచించి దాన్ని బాగు చేసుకోవటానికి ప్రయత్నిస్తాడు. మరికొన్ని సృష్టిరాసులు కూడా ఇలా చేస్తాయనటంలో సందేహం లేదు. ఉదాహరణకు చీమలు తమ ఆహారం కోసం ధాన్యపు గింజల్ని దాచు కుంటాయి, బంగారు పిచ్చుక చక్కని గూళ్ళు కట్టుకుంటుంది. కాని వీటి ఈ ఆచరణ, జ్ఞానంతో కూడుకున్నది కాదు. అవి కేవలం అలవాటుగానే అలా చేస్తాయి. వాటి జ్ఞానం రేపటి కోసం ఆహారం దాచుకోవాలి, కాలానికనుగుణంగా మంచి గూడు కట్టుకోవాలి అనే విషయాలను నిర్ణయించజాలదు. మానవుడు, ఇతర జీవరాసుల మధ్య మనకు కనబడే ఈ వ్యత్యాసం వల్ల మనకు తెలిసేదేమిటంటే మానవుడికి ఇతర జీవరాసులకంటే ఎక్కువ అవకాశాలు ఇవ్వబడాలి అనేది. పశుపక్ష్యాదుల జీవితం కేవలం నేటి జీవితమే. వాటికి రేపటి విషయం ఏమిటి? అనే జ్ఞానం ఉండదు. మానవునిలో కనిపించే ఈ రేపటి భావన అతనికి నేడు లభించిన ఈ జీవితం కంటే ఎన్నోరెట్లు అధికంగా ఉండటం అవసరం అని కోరుతుంది. మానవుడు “రేపు” ను కోరుకుంటున్నాడు. కాని అతనికి కేవలం “నేడు” మాత్రమే ఇవ్వబడింది.

ఇదేవిధంగా మనం మన సామాజిక జీవితాన్ని పరిశీలించినట్లయితే అందులో ఓ పెద్ద ఖాళీ ఉన్నట్లు మనం గమనిస్తాం. ఓ వైపు భౌతిక ప్రపంచం తన స్థానంలో నిలకడగా మనకు కనబడుతుంది. అది ఒక నియమబద్ధమైన చట్టంలో బంధించబడి ఉంది. దాని ప్రతి విషయం దాని నిర్ణీత మార్గంలో సాగిపోతోంది. మరో మాటలో చెప్పాలంటే, ఈ భౌతిక ప్రపంచం ఎలా ఉండాలో అలా ఉంది. కాని మానవ ప్రపంచ పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. అసలిక్కడ పరిస్థితి ఎలా ఉందంటే, ఎలా ఉండాలో అలాకాక దానికి భిన్నంగా ఉంది. ఇక్కడ ఒక మానవుడు మరో మానవుడిపై జులుం చేస్తున్నట్లు స్పష్టంగా చూడగలం. ఈ ఇద్దరూ అలాగే మరణిస్తారు. అంటే ఒకడు దౌర్జన్య పరుడికి దౌర్జన్యం చేసినందుకు శిక్ష, దౌర్జన్యానికి గురైన వాడివి తగిన న్యాయం కలగకుండానే ఈ ఇద్దరి జీవితాలు పరిసమాప్తమయినట్లు భావించ గలమా? ఒక వ్యక్తి సత్యాన్నే పలుకుతూ, ఇతరుల హక్కులను నెరవేరుస్తున్న కారణంగా అతని జీవితంలో ఎన్నో కష్టనష్టాలు సంభవిస్తాయి, మరో వ్యక్తి అసత్యాన్నే పులుకుతూ, ఇతరుల వంచించి వారి వస్తువుల్ని అన్యాయంగా కభళిస్తున్న కారణంగా అతని జీవితం ఎంతో సుఖసంతోషాలతో గడిచిపోతుంది. ఒకవేళ ఈ ప్రపంచం ఇలాంటి పరిస్థితిలోనే అంతమైపోతే ఈ ఇద్దరి విభిన్న పరిణామాలకు ఏ ప్రతిఫలం ఉండదా? ఒక జాతి మరో జాతిపై దౌర్జన్యం చేసి దాని సాధన ఒనరులన్నిటినీ ఆక్రమించుకున్నప్పటికీ, దాని దగ్గరున్న ప్రసార ప్రచార ఒనరుల ద్వారా అది మంచి జాతిగా పేరు తెచ్చుకోగలుగుతుంది. అణిగిపోయి ఉన్న జాతి పరిస్థితి ప్రపంచానికి తెలియకుండాపోతుంది. ఎందుకంటే దీని ఆర్తనాదాలను ప్రపంచ చెవులదాక చేరవేసే ఏ ఒనరులూ దీనివద్ద లేవు కాబట్టి. ఈ రెండింటి వాస్తవ పరిస్థితి ఏమిటో ఎప్పటికీ బహిర్గతం కాదా? ఇద్దరు వ్యక్తుల్లోకాని, లేక రెండు జాతుల్లోకాని ఏదైనా విషయంపై అభిప్రాయభేదం ఏర్పడి, అదో పెద్ద వివాదంగా మారిపోయి ఈ ఇద్దరూ లేక ఈ రెండు జాతులూ, ఎవరంతట వారు నిరపరాధులమని వాదిస్తారు. ఒకర్ని ఒకరు అపరాధులుగా, తప్పుడువారుగా రుజువు చేయటానికి ప్రయత్నిస్తారు. కాని ప్రపంచంలో వారి ఈ వివాదం పరిష్కారంకాదు. అయితే వీరిద్దరి నడుమ నిష్పక్షన్యాయం జరపటానికి ఏ న్యాయస్థానమూ లేదా? అణుయుగం అనబడే ప్రస్తుత కాలాన్ని అహంకార యుగం అనటం సముచితంగా ఉంటుంది. నేటి మానవుడు కేవలం తన భావాలు, కాంక్షలకు అనుగుణంగా గానే నడవాలని వాంఛిస్తున్నాడు. అతని భావాలు, ఆలోచనలు ఎంత తప్పుడు వైనా సరే! అవినీతి పరుడైన ప్రతి వ్యక్తి తనను తాను నిజాయితీపరునిగా రుజువు చేసుకోవటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాడు. పత్రికల్లో నాయకుల, పాలకుల ప్రకటనలను ఓసారి చూడండి. ప్రతి ఒక్కడూ తన దౌర్జన్యాలను గొప్ప ఘనకార్యాలుగా, తన తప్పులన్నిటినీ ఎంతో

ధర్మబద్ధ కార్యాలుగా రుజువు చేయాలని తంటాలుపడతాడు. ఈ మాయతెరలను కత్తిరించి వీరి బండారం బయటపెట్టడం జరగదా?

ఈ ప్రపంచం అసంపూర్ణమని పై పరిస్థితులు మనకు స్పష్టంగా తెలుపుతున్నాయి. వీటి పరిపూర్తి కొరకు ప్రతి ఒక్కరికీ సంపూర్ణ న్యాయం జరిగే మరో ప్రపంచం ఎంతైనా అవసరం. భౌతిక ప్రపంచంలో ఎక్కడైనా ఖాళీ ఉన్నట్లయితే దాన్ని పూరించటానికి తగిన కారణాలున్నాయి. భౌతిక ప్రపంచంలో ఎక్కడా ఏ లోపమూ కానరాదు. దీనికి భిన్నంగా మానవ ప్రపంచంలో ఓ పెద్ద ఖాళీ ఏర్పడి ఉంది. ఏ శక్తి అయితే భౌతిక ప్రపంచాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసిందో ఆ శక్తి దగ్గర మానవ ప్రపంచం ఖాళీని పూరించటానికి ఏ సామాగ్రీ లేదా? మన జ్ఞానం కొన్ని కార్యాల్ని మంచివిగా మరికొన్నింటిని చెడ్డవిగా భావిస్తుంది. మనం కొన్ని విషయాల్లో కొన్ని కావాలని, మరికొన్ని విషయాల్లో అవి కాకూడదని కోరుకుంటాం. కాని మన సహజ కోరికలకు వ్యతిరేకంగా అవన్నీ ఇక్కడ జరుగుతూనే ఉంటాయి. దీన్ని మానవ నైజం తప్పుగా భావిస్తుంది. ఈ విశ్వ నిర్మాణం ఓ యదార్థం ఆధారంగా జరిగిందని మానవునిలోని ఈ జ్ఞానం మనకు తెలుపుతోంది. ఇక్కడ మిథ్య, మాయలకు బదులు యదార్థం పైచేయిగా ఉండటం అవసరం. ఏ విషయమైతే భౌతిక ప్రపంచంలో పూర్తవుతుందో, అది మానవ ప్రపంచంలో పూర్తి అవ్వదా? ఈ యదార్థం ప్రస్ఫుటమవ్వదా?

ఈ ప్రశ్నల సమూహాన్నే నేను "మానవ పరిణామ అన్వేషణ" అని పైన పేర్కొన్నాను. ఈ పరిస్థితుల్ని చూసిన ఓ మనిషి తీవ్రమైన అశాంతికి లోనవుతాడు. జీవితం అనేది ప్రస్తుతం కనబడేదే అయితే ఇదొక పనికిమాలిన జీవితం అనే ప్రచండ భావాలు అతనిలో ఉప్పొంగుతాయి. విశ్వంలో మానవ జీవితం కోసమే ఎనలేని ఏర్పాట్లు చేయబడి ఉన్నాయని అతడు ఓ వైపు గమనించగలడు. అంటే ఈ విశ్వంలో ఉన్న సమస్తమూ మానవుని కోసమే. మరోవైపు కృతార్థం కాలేనంతటి పరిమిత జీవితాన్నిచ్చి అతన్ని ఈ విశ్వంలో ఎందుకు పుట్టించిట్లో అర్థం కావట్లేదు.

ఈ ప్రశ్న విషయంలో సాధారణంగా నేటి ప్రజల భావాలు ఎలా ఉన్నాయంటే, ఈ విధమైనటువంటి చిక్కుల్లో పడటం అనవసరం. ఇవన్నీ తత్వశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు. వాస్తవాభిలాష ఏమిటంటే ఈ జీవితంలో మీకు లభ్యమయ్యే ఒక్కో క్షణాన్నీ ఆనందభరిత జీవితంగా తీర్చి దిద్దుకోటానికి ప్రయత్నించండి. భవిష్యత్తులో ఏం జరుగుతుంది? లేక ఏదైతే జరుగుతుందో అది తప్పా, ఒప్పా? అనే ఆలోచనల్లో పడాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు.

ఎవరైతే ఈ విధంగా ఆలోచిస్తారో వారు ఇంకా మానవత్వాన్ని గుర్తించలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. వారు అధికారాన్నే యాదార్ధం అని భ్రమపడుతున్నారు. సంఘటనలు వారిని అంతం కానటువంటి జీవన రహస్యాలను తెలుసుకొమ్మని ఆహ్వానిస్తున్నాయి. కాని వారు ఈ కొద్ది రోజుల జీవితంతోనే సరిపుచ్చుకోవాలనుకుంటున్నారు. కాని మానవ నైజపు అవసరం ఏమిటంటే అది తన కోరికలు, శక్తిసామర్థ్యాల పరిపూర్తి కొరకు ఓ విశాలమైన ప్రపంచాన్ని అన్వేషిస్తుంది. కాని ఈ అజ్ఞానులు దేదీప్యమానమైన వెలుగుకు బదులు దాని నీడే చాలనుకొంటున్నారు. ఈ ప్రపంచం అసంపూర్ణమైంది. మరో సంపూర్ణమైన ప్రపంచం కోసం పరుగెత్తండి అని విశ్వం అరుస్తోంది. కాని మనం ఈ అసంపూర్ణమైన ప్రపంచంలోనే జీవన కట్టడాన్ని నిర్మించుకోవా లని, మనకు సంపూర్ణమైన ప్రపంచ అవసరం ఎంత మాత్రం లేదని నిర్ణయి చుకున్నాం. జీవితానికి ఓ పరిణామం (తుది) అంటూ ఉండాలని పరిస్థితులు స్పష్టంగా చెపుతున్నాయి. కాని వీరు ఆరంభాన్నే పట్టుకు కూర్చొని అంతం (పరిణామం) వైపు చూడకుండా కళ్ళుమూసుకున్నారు. వీరి ఈ తెలివిమాలిన తనం ఎలా ఉందంటే నిప్పుకోడికి సంబంధించిన సామెతలా ఉంది. ఒకవేళ జీవితంలో ఏదైనా సంఘటన జరగాలనుంటే అది తప్పక జరిగితీరుతుంది. ఎవరైనా దీనిపట్ల ఏమరపాటు వహించినంత మాత్రాన అది ఆగిపోదు అని అనుకొంటారు. కాని నిశ్చయంగా అది వాళ్ళ విషయంలో పనికిమాలిన నిర్ణయమే చేయగలుగుతుంది. వాస్తవం ఏమిటంటే ప్రస్తుత జీవితాన్నే సంపూర్ణ జీవితమని భావించటం, కేవలం ఈ రోజునే సుఖసంతోషాల రోజుగా చేసుకోవటమే లక్ష్యంగా పెట్టుకోవటం పెద్ద బలహీనత, అవివేకమూనూ. మనిషి ఒకవేళ తన జీవితం గురించీ, ఈ విశ్వం గురించీ కాస్తయినా ఆలోచిస్తే తన పనికిమాలిన దృష్టికోణం వెంటనే అతనికి తెలిసివస్తుంది. ఎవరైతే వాస్తవాలను చూడకుండా కళ్ళు మూసుకుంటారో, ఆలోచించకుండా, అర్థంచేసుకోకుండా జీవితం గడపటం ప్రారంభిస్తారో అటువంటి వారే ఇటువంటి పనికిమాలిన నిర్ణయాలు తీసుకుంటారు.

ఇటువంటి ప్రశ్నలే విశ్వాన్ని చూడగానే ఒక్కసారిగా మన మేధలో ఉత్పన్నమవుతాయి. ఈ విశ్వానికి ఓ సృష్టికర్త ఉండాలి. కాని ఆయన విషయంలో మనకేమీ తెలియదు. దీన్ని నడపటానికి, అదుపులో ఉంచటానికి ఓ నిర్వాహకుడు కావాలి. కాని ఆయనెవరో కూడా మనకు తెలియదు. మనం మరొకరి ఉపకారాలతో కప్పబడి ఉన్నాము. ఆయన ముందు తమను తాము, తమ భావోద్రేకాలను సమర్పించుకోవటానికి మూర్తీభవించిన కృతజ్ఞతాభావంతో ఆ శక్తిని గురించి అన్వేషించటానికి ప్రయత్నిస్తాము. కాని అటువంటి ఉనికి మనకు ఎక్కడా కానరాదు. మనం ఈ విశ్వంలో ఎంతో నిస్సహాయ స్థితిలో ఉన్నాము.

మనం మన రక్షణ కోసం ఓ ఆశ్రయాన్ని అన్వేషిస్తున్నాము. ఆ ఆశ్రయం పొంది మనం పూర్తిగా రక్షింపబడినట్లు భావిస్తాము. కాని అటువంటి ఏ ఆశ్రయమూ మన కళ్ళ ముందు కనబడటంలేదు. మనం మన జీవితాన్ని , ఆయుష్షును చూసినట్లయితే విశ్వవైరుధ్యం మనకు అర్ధంకానిదిగా అనిపిస్తుంది. విశ్వం వయసు సహస్రకోటి సంవత్సరాలు. అయితే ఆ విశ్వం కోసమే పుట్టించబడ్డ మనిషి వయసు కేవలం కొన్ని సంవత్సరాలేనా? ప్రకృతి మనలో అసంఖ్యాకమైన కోరికలు, భావాలను నింపింది కాని ఆ కోరికల పరిపూర్తి కొరకు ఏ సామాగ్రీ ఏర్పాటు చెయ్యలేదా? అన్నిటికంటే కఠినమైన వైరుధ్యం భౌతిక ప్రపంచంలో, మానవ ప్రపంచంలో మనకు కనబడుతుంది. భౌతిక ప్రపంచం ఏ విధమైనటువంటి లోటుపాట్లు లేకుండా సంపూర్ణంగా ఉంది. దీనిలో ఎక్కడా ఏ ఖాళీ అగుపడదు. కాని మానవ జీవితంలో ఓ పెద్ద ఖాళీ ఏర్పడి ఉంది. సర్వోత్కృష్ట జీవి అయిన మానవుని పరిస్థితి ఇతర సృష్టిరాసుల కంటే హీనాతిహీనంగా కనబడుతోంది. మన దురదృష్టమేమిటంటే ఒకవేళ పెట్రోలు బావి కనుగొన బడినా, లేక గొర్రెలు, మేకల సంతతిలో అభివృద్ధి జరిగినా మనిషి ఎంతగానో సంతోషిస్తాడు. కాని మానవ సంతతి అభివృద్ధి చెందితే మాత్రం మనిషి సహించలేడు. మనం మన ఆర్ధిక బాధలతో ఎంతగా సతమతమవుతున్నా మంటే కుటుంబ నియంత్రణ ద్వారా మానవ సంతతిని నిరోధించి, ఈ బాధల నుండి విముక్తి అవ్వాలని అనుకుంటున్నాము.

ఈ ప్రశ్నలు మనల్ని నలువైపుల నుండి పరివేష్టించి ఉన్నాయి. అవి లోపలి నుండి పొంగుతున్నాయి. బయటి నుండి కమ్మేస్తున్నాయి. కాని వీటికి సమాధానమేమిటో మనకు తెలియదు. ఇది జీవిత పరమార్థానికి సంబంధించిన ప్రశ్న. మనకు జీవితమైతే దొరకిపోయింది. కాని దాని పరమార్ధమేమిటో మనకు తెలియపరచటం జరగలేదంటే ఆశ్చర్యం కలుగుతోంది.

ఈ యదార్థాన్ని తెలుసుకోవటానికి మనం మన బుద్ధీ, అనుభవాలను ఉపయోగించి దీనికి సరియైన, ఖచ్చితమైన సమాధానం తెలుసుకోవటానికి ప్రయత్నించినా అది సాధ్యమయ్యేపనికాదు. ఈ విషయంలో మనం ఇప్పటివరకూ ఏ అభిప్రాయాలనైతే కలిగి ఉన్నామో అవి కేవలం ఊహలు, అంచనాలు మాత్రమే. అంతకు మించి వాటికి మరే విలువా లేదు. ఏ విధంగానైతే మన దృష్టి పరిది పరిమితమో, ఓ ప్రత్యేక శరీరంతో చిన్న చిన్న వస్తువులను ఎలా చూడలేమో, ఓ ప్రత్యేక దూరంలో ఉండి సుదూర వస్తువులు ఎలా తిలకించలేమో అలాగే విశ్వం విషయంలో కూడా మన జ్ఞానం పరిమిత హద్దుల్లో బంధించబడి ఉంది. దాని ముందూవెనకా సంభవించే విషయాల గురించి మనకేమీ తెలియదు. మన జ్ఞానం అసంపూర్ణమైంది. మన జ్ఞానేంద్రియాలు బలహీనమైనవి. మనం యదార్థాలను చూడలేము.

మైదాను, మసిని కలిపినట్లయితే నీలిరంగు కలిగిన బూడిద లాంటి ఓ పొడి తయారవుతుంది. ఈ పొడి రేణువుల్లో కలసిపోయేటంత సన్నగా ఉండే ఓ కీటకం, దాన్ని కేవలం సూక్ష్మదర్శిని సహాయంతో మాత్రమే చూడగలం. అలా చూసినప్పుడు ఆ పుప్పొడిరేణువు లాంటి అతి సన్న కీటకాన్ని సూక్ష్మదర్శిని నల్లనల్లని తెల్లతెల్లని ఓ పెద్దరాయిగా మనకు చూపిస్తుంది. దాని దృష్టిలో ఈ పొడికి అసలు విలువలేదు.

మానవ జీవితాన్ని ఈ భూగ్రహం ఉనికిలోకి వచ్చినప్పటి కాలంతో పోల్చిచూస్తే, జీవితం ఎంత పరిమితమైందంటే అదసలు లెక్కలోనిదే కాదు. స్వయంగా ఈ భూగ్రహం కూడా విశ్వంలోని మహాసముద్రాల్లోని ఓ నీటి బిందువు కంటే కూడా తక్కువే . ఇటువంటి పరిస్థితులో మానవుడు విశ్వస్థితి గతులపై ఏ అభిప్రాయలనైతే వెలిబుచ్చుతున్నాడో అతణ్ని గుడ్డివాడు చీకటిలో ఓ వస్తువును వెదుకుతున్నట్లు పోల్చవచ్చు. మనలో ఈ విశ్వవైశాల్యం భావన రాగానే వెంటనే మన అజ్ఞానం  బయటపడిపోతోతుంది. మనకు అనుగ్రహింపబడ్డ ఈ సూర్యుడు ఎనభై సహస్ర కోట్ల సంవత్సరాలుగా ఉనికిలో ఉన్నాడు. మనం నివసిస్తున్న ఈ భూగ్రహం వయసు రెండు శతకోట్ల సంవత్సరాలు. ఈ భూగ్రహంపై జీవన చిహ్నాలు ప్రత్యక్షమై మూడు కోట్ల సంవత్సరాలు గడిచిపోయ్యాయి. కాని పుడమిపై బుద్ధిజీవి అయిన మానవుని చరిత్ర ప్రారంభమైన పదిహేను, ఇరవై వేల సంవత్సరాల కంటే ఎక్కువ కాలేదు. కొన్ని వేల సంవత్సరాల ఈ అతికొద్ది కాలంలోనే మానవుడు తన జ్ఞానాన్ని సమకూర్చుకున్నాడని స్పష్టంగా తెలిసిపోయింది. ఈ సుదీర్ఘ కాలం ఓ అత్యల్ప భాగమే. అసలీ విశ్వ రహస్యాన్ని తెలుసుకోవడం ఎంతైనా అవసరం. విశ్వం అనంతమైన గతానికి, భవిష్యత్తుకు మధ్యలో మానవ జీవితం కేవలం ఓ క్షణకాలమైనా ఉంటుందో లేదో మనకు తెలియదు. మన ఉనికే అతి బలహీనమైనటువంటి మధ్యస్థ ఉనికి, దీని ముందూ, వెనుకల గురించి మనకేమీ తెలియదు. అవధుల్లేనటువంటి ఈ విశ్వ వైశాల్యాన్ని అర్థం చేసుకోవటానికి మన బుద్ధీ, అనుభవాలు ఎంత మాత్రం సరిపోవు. మనం మన పరిమిత జ్ఞానం ద్వారా ఎప్పటికీ దీన్ని అర్థం చేసుకోలేమని స్వయంగా మన బుద్ధే నిస్సహాయంగా అంగీకరిస్తుంది.

ఈ విధంగా మన జ్ఞానం, మన అధ్యయనాలు మనల్ని ఎన్నో ప్రశ్నల ఓ సముదాం ముందు నిలబెడతాయి. అవి ఎలాంటి ప్రశ్నలంటే వాటి సమాధానాలు తెలుసుకోవటం తప్పనిసరి. ఈ సమాధానాలు తెలుసుకోనిదే మానవ జీవితం పనికిరానిదిగా, నిరర్థకమైందిగా కనబడుతుంది. కాని ఎప్పుడైనా మనం వీటిని  గురించి ఆలోచిస్తే  మనం మన మేధతో వీటి జవాబులు తెలుసుకోలేమని అర్థమవుతుంది. యదార్థాన్ని వీక్షించగలిగే చర్మచక్షువులే మనకు

ప్రసాదించబడలేదు. యదార్థాన్ని గ్రహించగలిగేంతటి మేధ కూడా మనకు అనుగ్రహింపబడలేదు.

ఇటువంటి సందర్భంలో ఓ వ్యక్తి మన ముందుకొచ్చి ఇలా అంటాడు. ఏ యదార్థాన్నయితే మీరు తెలుసుకోగోరుతున్నారో దానికి సంబంధించిన జ్ఞానం నాకు ప్రసాదించబడింది. అదేమిటంటే:

"ఈ విశ్వానికి ఒక దేవుడున్నాడు. ఆయనే ఈ ప్రపంచాన్నంతటినీ సృష్టించాడు. తన అసాధారణ శక్తి ద్వారా దీన్ని నడిపిస్తున్నాడు. మీ దగ్గరున్న వస్తువులన్నీ ఆయనే మీకు ప్రసాదించాడు. సర్వవిషయాలపై ఆయనకే అధికారం ఉంది. మీరు చూసే ఈ భౌతిక ప్రపంచంలో ఏవిధమైనటువంటి వైరుధ్యంలేదు. అది తన విధిని సక్రమంగా నెరవేరుస్తుంది. దీనికి భిన్నంగా మానవ ప్రపంచం అసంపూర్ణంగా కానవస్తోంది. ఇక్కడ తీవ్రమైన గందరగోళం చెలరేగుతుంది. దీనిక్కారణం ఏమిటంటే ఇక్కడ మానవునికి స్వేచ్ఛనిచ్చి పరీక్షించటం జరుగుతోంది. మీ ప్రభువు కోరేదేమిటంటే భౌతిక ప్రపంచంలో ఏ చట్టమైతే సవ్యంగా అమలులో ఉందో, మానవుడు స్వయంగా దాన్ని స్వీకరించాలి. ఉనికిలో ఉన్న ఈ విశ్వానికి పాలకుడే దాని సహాయకుడు, సంరక్షకుడూనూ. ఆయనే మీ వినమ్రతా, కృతజ్ఞతాభావాలకు అర్హుడు. ఆయనే మీకు రక్షణ కల్పించేవాడు. ఆయనే మరణానంతరం సంభవించ బోయే మీ అనంతమైన జీవితం కోసం సకల ఏర్పాట్లూ చేసి పెట్టాడు. అక్కడే మీ కోరికల సంతృప్తి కలుగుతుంది. అక్కడ సత్యాసత్యాలను ప్రస్ఫుటంగా వేరుచెయ్యటం జరుగుతుంది. సచ్ఛీలురకు వారి పుణ్యఫలం, దుర్మార్గులకు వారి పాప పర్యవసానం లభిస్తాయి. ఆయన నా ద్వారా తన గ్రంథాన్ని మీ కోసం పంపించాడు. దాని పేరు ఖుర్ఆన్. ఎవరైతే దీన్ని విశ్వసిస్తారో వారు సాఫల్యం పొందుతారు. మరెవరైతే దీన్ని తిరస్కరిస్తారో వారు పరాభవం పాలవుతారు."

నేటికి దాదాపు పధ్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వం అరేబియా ఎడారుల్లో మహమ్మద్(స) ఇచ్చిన పిలుపది. అది నేడు కూడా మనల్ని పిలుస్తూనే ఉంది. దాని సందేశం ఏమిటంటే, ఒకవేళ మీరు యదార్థాన్ని తెలుసుకోదలిస్తే నా పిలుపును వినండి. నేను చెప్పే విషయాలను గురించి ఆలోచించండి.

ఈ పిలుపు ఖచ్చితంగా యదార్థాన్ని తెలిపే సాధనమా? మనం దీన్ని విశ్వసించవలసిందేనా? ఏ ఆధారం వెలుగులో మనం ఈ పిలుపును సత్యమా, అసత్యమా అని నిర్ణయించుకోవాలి?

కొందరేమంటారంటే, యదార్థాన్ని వారు తమ కళ్లారా చూసి విశ్వసిస్తామంటారు.

మీరు యదార్థాన్ని తమ కళ్ళారా చూడాలని అభిలషిస్తున్నారు. ఈ కోరిక ఎలా ఉందంటే ఓ వ్యక్తి ఖగోళశాస్త్ర అధ్యయనం గణితం లేకుండానే చేసే ప్రయత్నంచేసి, “ఖగోళ శాస్త్రం కేవలం కళ్ళకు కనబడే విషయాలనే ఆమోదిస్తుందని” అంటాడు. ఈ పరిశోధన కోసం గణిత శాస్త్రం అతని దృష్టిలో ఆమోదయోగ్యం కాదు. దీని వల్ల మనిషికి తన శక్తిసామార్థ్యాల పట్ల పూర్తి అవగాహనలేదని మనకు స్పష్టమవుతుంది.

మానవుని పరిశోధనా సామార్థ్యం చాలా పరిమితమైంది. సత్యం అనేది మనం పరిశోధించలేనటువంటి విషయం. మనం దాని అనుభూతుల్ని గ్రోలగలం, కాని చూడలేము. ఒకప్పుడు ప్రజలు ఈ ప్రపంచం “అగ్ని, నీరు, మట్టి, గాలి” అనే నాలుగు వస్తువుల విలీనం వల్ల తయారైంది అని భావించే వారు. మరోమాటలో చెప్పాలంటే పాతకాలంనాటి మానవుడు ఏమని అపోహపడేవాడంటే యదార్థం అనేది మనం కళ్ళారా చూడగలిగే వస్తువు అని భావించేవాడు. కాని ఆధునిక పరిశీలనలు ఈ విధమైనటువంటి నమ్మకాలను వమ్ముచేశాయి. ప్రపంచంలోని వస్తువులన్నీ తమ చివరి విశ్లేషణలో సుక్ష్మాతిసూక్షమైన అణువుల రూపంలో ఉన్నాయని ఇప్పుడు మనకు తెలిసింది. ఈ అణువు ఓ సగటు యాపిల్ పండు కంటే చాలా చిన్నది. అంటే మన భూగ్రహంతో పోలిస్తే ఆ యాపిల్ పండు ఎంత స్వల్పమైందో ఆ పండు ముందు అణువు కూడా అంతేనన్న మాట. ఈ అణువు ఓ విధమైనటువంటి సూర్యవ్యవస్థ. దీనికోకేంద్రం కూడా ఉంది. ఈ కేంద్రంలో ప్రొటాన్లు, న్యూట్రాన్‌లు ఉంటాయి. దీని నలువైపులా ఎలక్ట్రాన్లు వివిధ కక్ష్యల్లో భ్రమిస్తూ ఉంటాయి. ఎలాగైతే సూర్యిని చుట్టూ గ్రహాలు పరిభ్రమిస్తామో ఒక సెంటీ మీటరులోని ఐదువేల కోట్ల వంతు వ్యాసాంగం ఎలక్ట్రాన్ తన కేంద్రం నలువైపులా ఒక సెకనులో కొన్ని కోట్ల సార్లు పరిభ్రమిస్తుంది. ఇక దీన్ని గురించి ఉహించటం కూడా వ్యర్థమే అవుతుంది. ఎందుకంటే ఇది అంతర్‌లోకాల చివరి పరిధేమో, అది కూడా మనకు తెలియదు. అంతేకాదు ఈ అంతర్భాగాల్లో ఇంతకంటే కూడా చిన్నచిన్న లోకాలు మరెన్ని ఉన్నాయో?

మన పరిశోధనా జ్ఞానం ఎంత బలహీనమైనదో దీనివల్ల మనకు అర్థమవుతుంది. పరస్పరం కలిసి ఓ కేంద్రాన్ని స్థాపించిన ప్రొటాన్ న్యూట్రాన్‌ల అణువులు ఎలా స్థిరంగా నిలిచి ఉన్నాయి? అసలీ ప్రోటాన్, న్యూట్రాన్‌లు కేంద్రం నుండి వెలుపలికి ఎందుకు రావు? ఏ వస్తువు ఈ రెంటిని ఒకదానితో మరోదాన్ని బంధించి ఉంచింది. సైంటిస్టుల అభిప్రాయం ఏమిటంటే ఈ భౌతిక అణువుల్లో ఓ శక్తి ఉంది. ఈ శక్తే కేంద్రంలోని ప్రోటాన్లను, న్యూట్రాన్లను పరస్పరం బంధించి ఉంచింది. దీన్నే సమీకృత శక్తి (Blinding Energy) అని అంటారు. అంటే

పదార్థపు చివరి విశ్లేషణలో శక్తి ఉందన్న మాట. ఈశక్తి పరిశోధనలోకి రాగల వస్తువా? ఏదైనా సూక్ష్మదర్శిని ఆధారంగా దీన్ని చూడగలమా? అని నేను అడుగుతున్నాను. దీనివల్ల రుజువైపోయిందేమిటంటే ఆధునిక శాస్త్రవేత్తలు స్వయంగా యదార్థం అనేది పరిశోధనకు చిక్కని ఓ అతీంద్రియ వస్తువు, దీన్ని ఏ మానవ నయనాలూ చూడలేవు అని అంగీకరించారు.

ఇప్పుడు ఒకవేళ ప్రవక్త మాటను అంగీకరించటానికి, ఆయన ఏ యదార్థాన్ని గురించి చెపుతున్నాడో ఆ యదార్థానికి శరీరం ఉంటే దాన్ని తాకి, చూసి అప్పుడు మేము అంగీకరిస్తాం అనే షరతు విధించినట్లయితే అదసలు సహేతుకమైన, సముచితమైన మాట ఎంతమాత్రం కాదు. ఈ షరతు ఎలా ఉందంటే భారత చరిత్రను చదివే ఓ విద్యార్థి ఈస్ట్ ఇండియా కంపెనీ పరిస్థితుల్ని అధ్యయనం చేస్తూ, ఉపాధ్యాయునితో, ఈ కంపెనీ పూర్తి పనుల్నీ నా ముందుకు తెచ్చి నిలబెట్టండి. అవి నా ముందు గతంలో జరిగిన విషయాలన్నీ మళ్లీ నాకు తెలపాలి. అప్పుడు నేను మీ చరిత్రను అంగీకరిస్తాను అన్నట్లుంది.

మరి ఏ ఆధారం వెలుగులో ఈ సందేశం సత్యమా, అసత్యమా? దీన్ని స్వీకరించాలా, వద్దా? అని నిర్ణయిద్దాం? నా దృష్టిలో ఈ సందేశాన్ని పరీక్షించటానికి మూడు ముఖ్యమైన విషయాలు ఉన్నాయి. మొదటిది, ఈ సిద్ధాంతం వాస్తవానికి ఎంత దగ్గరగా ఉంది? రెండవది, జీవితపరిణామం విషయంలో దీని దావా కేవలం దావా (Challenge) యేనా లేకా ఏదైనా ఆధారం ఉందా? మూడవది, అది అందజేసే వాక్యాల్లో, అవి దైవవాణియే అని నమ్మటానికి దానిలో అంతటి ప్రాముఖ్యం ఏదైనా ఉందా? ఈ మూడు విషయాల ఆధారంగా ప్రవక్త కార్యాలను మనం సమీక్షించినట్లయితే ఆ కార్యాల్లోని ఒక్కో విషయం మనముందు అజేయంగా నిలుస్తాయి.

1.దైవ ప్రవక్త (స) ఈ విశ్వాన్ని ఎలా సిద్ధాంతీకరించారంటే, దానిలో మన అసంఖ్యాక వివాదాలకు పరిష్కారం ఇమిడి ఉంది. మన అంతరంగంలో, బాహ్యంలో ఉత్పన్నమయ్యే సకల ప్రశ్నలకూ అది ఓ చక్కని సమాధానం.

2. జీవిత పర్యవసానాల విషయంలో ఆయన ఏ ఛాలెంజ్ అయితే చేస్తున్నాడో, దానికి సంబంధించిన ఓ ఖచ్చితమైన ఆధారాన్ని కూడా ఆయన మనకు చూపుతున్నాడు.

అదేమిటంటే మరణానంతరం సంభవించబోయే పర్యవసానాలకు సంబంధించిన వార్తలను ఓ నమూనాగా ఆయన నేడు మనకు చూపుతున్నాడు.

3. ఆయన ఏ వ్యాక్యాలనైతే దైవవాణి అని అంటున్నాడో వాస్తవంగానే, వాటిలో అంతటి అసాధరణ విశిష్టత మనకు కనబడుతుంది. నిస్సందేహంగా ఇదొక మనవాతీత శక్తి వాణి. ఇది ఏ మానవమాత్రుని వాక్కు ఎంత మాత్రం కాజాలదు అని అంగీకరించవలసి ఉంటుంది.

రండి! ఇప్పుడు పై మూడు విషయాల ఆధారంతో దైవ ప్రవక్త (స) సందేశాన్ని సమీక్షిద్దాం!

1. ఈ సందేశానికున్న మొట్టమొదటి ప్రాముఖ్యం ఏమిటంటే అది మానవ నైజానికి పూర్తిగా అనుగుణంగా ఉంది. అంటే మానవుని పుట్టుక ఏ ప్రకృతిపరంగా జరిగిందో, ఆ ప్రకృతి సిద్ధాంతమే ఈ సందేశం. ఈ సిద్ధాంతం పునాది ఒకే దేవుని ఉనికిపై ఆధారపడి ఉంది. ఒకే దేవుడు అనే జ్ఞానం మానవ నైజంలోనే ఇమిడి ఉంది. దీనికి పటిష్టమైన రెండు సంబంధాలున్నాయి. ఒకటేమిటంటే, పూర్తి మానవ చరిత్ర తెలిసిన కాలాల్లో మానవుల అధిక సంఖ్యాకులు అంటే దాదాపుగా అందరూ ఒకే దేవుని ఉనికిని అంగీక రించారు. వీరిలోని అధిక సంఖ్యాకులు దైవజ్ఞానం నుండి దూరమై కాలం గడిపినట్లు మనకు కనబడదు. దైవానికి సంబంధించిన జ్ఞానం మానవ నైజంలోని ఓ పటిష్టమైన భాగం అని పురాతనకాలం నుండి నేటి వరకూ మానవ చరిత్ర ఏకాభిప్రాయంగా సాక్ష్యమిస్తోంది. ఇక రెండవ సంబంధం ఏమిటంటే, మానవునికి ఎప్పుడైనా అతి సున్నితమైన సమస్య ఎదురైతే అప్రయత్నంగా అతని హృదయం దేవుని వైపు మరలుతుంది. ఎటూ ఏ సహాయమూ కానరాని స్థితిలో అతడు దైవసహాయం కోసం పరుగులు తీస్తాడు. పండితుడైనా, పామరుడైనా, ఆస్తికుడైనా, నాస్తికుడైనా, జ్ఞాని అయినా, అజ్ఞాని అయినా ఎవరైనా సరే, మానవుని శక్తిసామర్థ్యాలకు అతీతమైన సమస్య ఎదురైనప్పుడు అతడు శక్తులన్నిటిపై సర్వాధికారం కలిగి ఉన్నటువంటి ఓ అసాధరణ శక్తిని పిలుస్తాడు. మానవుడు తన క్లిష్ట సమయాల్లో దైవం వైపునకు మరలటం తప్పనిసరి. దీనికో మంచి ఉదాహరణ 'స్టాలిన్' జీవితంలో మనకు లభిస్తుంది. రెండవ ప్రపంచం యుద్ధ పరిస్థితుల్ని సమీక్షిస్తూ 'మిస్టర్ చర్చిల్' తన గ్రంథం నాల్గవ భాగంలోని 433వ పేజీలో ఈ విషయాన్ని ప్రస్తావించాడు. 1942 సంవత్సరం అతిసున్నిత పరిస్థితుల్లో 'హిట్లర్' యూరప్ మొత్తానికి కొరకరాని కొయ్యగా తయారై ఉన్నాడు. ఆసమయంలోనే చర్చిల్ మాస్కో పర్యటించాడు. ఆ సంద్భంలో చర్చిల్ స్టాలిన్‌కు సమక్య సైనిక శిక్షణ' గురించిన తన ప్రణాళికను పూర్తి సంతృప్తి చెందిన స్టాలిన్ ఎంతగానో సంతోషించి, "దైవం ఈ ప్రణాళికను విజయవంతం చేయుగాక!" అని అప్రయత్నంగా అనేశాడు.

దీంతోపాటు విశ్వపరిశీలన తరువాత మానవుని మేధలో ఉద్భవించి, అతడు తెలుసుకోగోరే సకల ప్రశ్నలకూ ప్రవక్త (స) పిలుపులో సంపూర్ణ సమాధానం ఉంది. అదే ఆ సిద్ధాంత ప్రాముఖ్యం. ఈ విశ్వం కేవలం కాకతాళీయంగా ఉనికిలోకి రాలేదు. దీన్ని సృష్టించినవాడు తప్పక ఉండాలి అని విశ్వపరిశీలన వల్ల మనకు తెలిసిపోయింది. ఈ సమాధానం మనకు ఈ సిద్ధాంతంలోనే కనిపిస్తుంది. ఈ విశ్వం కేవలం ఓ భౌతిక యంత్రం కాదని దీని వెనుక ఓ అసాధరణ శక్తి ఉందని అదే దాన్ని నడిపిస్తుందని మనకు కనబడుతూనే ఉంది. ఈ సిద్ధాంతంలో ఆ సమాధానం కూడా ఇమిడివుంది. మనకు మన ఉపకారి అన్వేషణ సమస్య ఉండేది. ఎటువంటి ఉపకారి అంటే మన అవసరాల్లో మనకు సహాయం చేసే ఓ శక్తి అన్వేషణ. ఈ సిద్ధాంతంలో ఈ అన్వేషణకు కూడా సమాధానం ఉంది. మనం మన జీవితాన్ని అపరిమితమైనదిగా చూడదలుస్తున్నాం. మనం మన కోరికల పరిపూర్తి కోసం ఓ సువిశాల మైదానాన్ని అన్వేషిస్తున్నాం. మరి మన జీవితం ఎందుకింత పరిమితంగా ఉంది అని ఆశ్చర్యం కలుగుతోంది. ఈ సిద్ధాతంలో దీనికి కూడా సమాధానం ఉంది. సత్యం సత్యంగానే ఉండాలని, అసత్యం అసత్యమేనని, మంచీ చెడులు వేరుపరచబడాలని, ప్రతిఒక్కరికీ సముచిత స్థానం ప్రసాదించబడాలని, మానవ పరిస్థితులు బలంగా కోరేవీ. దీని జవాబు కూడా ఈ సిద్ధాంతంలో ఉంది. అంతే కాదు జీవితంతో సంబంధం కలిగివున్న సకల ప్రశ్నలకూ దీనిలో పూర్తి సమాధానం ఉంది. ఆ సమాధానాలు కూడా ఎంత మంచి సమాధానాలంటే ఇక అంతకుమించి మంచి సమాధానాల గురించి మనం ఊహించలేము. విశ్వపరిశీలన వల్ల మన మేధలో ఉద్భవించే సకల ప్రశ్నలూ దీనితో పరిష్కారమైపోతాయి.

2. ఈ సందేశం మరో ప్రాముఖ్యం ఏమిటంటే, జీవిత పర్యవసానం విషయంలో ఆయన ఏ సిద్ధాంతాన్నయితే ప్రతిపాదిస్తున్నాడో దానికి సంబంధించిన ఓ ఆచరణాత్మక నమూనా స్వయంగా తన జీవితంలో మనకు చూపెడుతున్నాడు. ఆయన ఏమంటాడంటే ప్రపంచం దౌర్జన్యపరుణ్ణి, దౌర్జన్యానికి గురయ్యేవాణ్ణి తీసుకొని అలాగే అంతమైపోదు. ఈ పర్యవసానం కోసం విశ్వ ప్రభువు ప్రత్యక్షమై సత్యవంతుల్ని, అసత్యవాదుల్ని వేరుచేస్తాడు. ఆ రోజు రావటంలో ఏదైతే ఆలస్యం ఉందో అది కేవలం మీ కొరకు నిర్ణయించబడిన కార్యాల సమయం పరిపూర్తి కావటానికి మాత్రమే.

ఆయన కేవలం ఈ మాటల్ని అని మాత్రమే ఊరుకోడు. దీనితోపాటు ఆయన ఛాలెంజ్ కూడా చేస్తున్నాడు. నేను ఏ విషయాలనైతే చెపుతున్నానో అవి నిజమని నమ్మటానికి రుజువేమిటంటే ఆ న్యాయస్థానపు ఓ నమూనా (Model) ను విశ్వప్రభువు నా ద్వారా ఈ

ప్రపంచంలోనే మీకు చూపిస్తాడు. నా ద్వారానే ఆయన సత్యానికి జయం, అసత్యానికి అపజయం చేకూరుస్తాడు. తన విధేయులకు గౌరవాన్ని ప్రసాదిస్తాడు. అవిధేయులను నీచులుగా చేసి కఠిన శిక్షకు గురిచేస్తాడు. ప్రజలెంత వ్యతిరేకించినా, తమ శక్తినంతా ధారపోసి దాన్ని రూపుమాపటానికి ప్రయత్నించినా, ఈ సంఘటన మాత్రం తప్పక సంభవించితీరుతుంది. ఏ విధంగానైతే పరలోకం సంభవించటం ఖచ్చింతంగా నిర్ణయమై ఉందో ఏ విధంగానైతే ఎవరూ దాన్ని ఆపలేరో అదే విధంగా నా జీవితంలో దాని నమూనా చూపించటం కూడా నిర్ణయమైపోయింది. ఇది రాబోయే రోజుకు ఓ సూచన. విశ్వ నిర్మాణం న్యాయంపై జరిగిందనే దానికి ఇదొక నిదర్శనం నేను ఏ శక్తి ప్రతినిధితో ఆశక్తి సర్వశక్తులపై సర్వాధికారం కలిగి ఉంది. ఆ శక్తి ఓ రోజు మనల్నందర్నీ తన న్యాయస్థానంలో హాజరుపరచి పూర్వం వారిని, తరువాయి వారిని విచారించి తీర్పునిస్తుంది.

ఒంటరి పరిస్థితిలో ఆయన ఈ ఛాలెంజ్ చేస్తున్నాడు. జాతి మొత్తం ఆయనకు శత్రువులయ్యారు. స్వయంగా ఆయన దేశం ఆయనకు నిలువనీడనివ్వటానికి సిద్ధంగా లేదు. దగ్గరి వారు సైతం ఆయనకు దూరమయ్యారు. ఆయన వద్ద ఏ విధమైనటువంటి ప్రాపంచిక వస్తుసామగ్రి లేదు. ఏ వనరులూ లేని ఇటువంటి వ్యక్తి దృఢవిశ్వాసంతో విజయం నాదే అని ప్రకటిస్తున్నాడు. నా ద్వారానే దేవుని న్యాయస్థానం భూమిపై స్థాపించబడుతుంది అని ప్రకటిస్తున్నాడు. ఈ మాటలు విన్న ప్రజలు ఆయన్ని ఎగతాళి చేశారు. కాని ఆయన ఎంతో ప్రశాంత హృదయంతో, హుందాగా, గంభీరంగా తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. దేశంలోని అధిక సంఖ్యాకులు ఆయన్ను అంతమొందించాలని తీర్మానించుకున్నారు. ఆయన్ను ఆర్థికంగా నష్టపరిచారు. దేశం వదిలి వెళ్ళిపొయ్యేలా ఆయనపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆయన్ను తుదిముట్టించాలని తమ పూర్తి శక్తియుక్తుల్ని ధారపోశారు. కాని ఆయన ముందు ఇవేమీ ప్రభావాన్ని కనబరచలేకపొయ్యాయి. అయినప్పటికీ ఆయనకెవరైనా సహకరించినా వారు అతికొద్ది మంది మాత్రమే. ఒకవైపు ఓ స్వల్పపరివారం ఉంటే, రెండవ వైపు అత్యధిక సంఖ్యాకులున్నారు. ఓవైపు సకల సాధన సామగ్రి ఉంటే మరో వైపు ఏ ఒనరులూలేని రిక్తహస్తాల వారు. ఓ వైపు దేశపౌరుల, ఇరుగుపొరుగు జాతుల ప్రోత్సాహం ఉంటే, రెండో వైపు స్వయంగా తనవారి, పరాయివారి సమైక్య శతృత్వం. పరిస్థితుల అనంతమైన ప్రతికూలత పట్ల ఆయన సహచరులు బెంబేలెత్తిపొయ్యేవారు. కాని ప్రతిసారీ ఆయన(స), నిరీక్షించండి! దేవుని తీర్పు వచ్చేస్తుంది, దాన్ని ఏ శక్తీ ఆపజాలదు. అని అనేవారు.

ఆయన ఛాలెంజ్‌పై శతాబ్దపు నాల్గవ వంతు కూడా గడవకముందే అది సంపూర్ణ

రూపంలో పూర్తయింది. చరిత్రలో అది ఏకైక విశిష్ట సంఘటనగా చిరస్థాయిగా నిలిచిపోయింది. ఒక వ్యక్తి ఏ సవాళ్ళతో (Challenges) తన పని ప్రారంభించాడో, అతని వ్యతిరేకులు సైతం దాన్ని వేలెత్తి చూపకుండా సరిగ్గా అదేరూపంలో ఆ సవాళ్ళు నెరవేరాయి. సత్యం, అసత్యం వేరై పొయ్యాయి. దైవ విధేయులకు గౌరవం, ఆధిక్యత, గెలుపు వరించాయి. దైవతిరస్కారుల మెడలు వంచి వారిని అణిచివేయటం జరిగింది.

ఈ విధంగా ఆ సందేశం మానవులకు ఏ పర్యవసానాలను గురించి తెలిపిందో, దాని నమూనా ప్రళయం వరకూ గుణపాఠం గరిపే ఓ సూచనగా ఈ ప్రపంచంలోనే స్థాపించబడింది. ఈ నమూనా పరలోకంలో పరిపూర్ణమవుతుంది. అప్పుడు మానవులందర్నీ దైవ న్యాయస్థానంలో హాజరుపరచి తుది తీర్పునివ్వటం జరుగుతుంది.

3) ఆ వ్యక్తి దేన్నయితే దైవవాణి అని తెలుపుతున్నాడో, అదే ఆయన వాదాన్ని యదార్థమని రుజువుచేసే మూడవ నిదర్శనం. ఈ గ్రంథంపై (ఈ గ్రంథం అవతరించి) ఎన్నో శతాబ్దాలు గడిచిపోయ్యాయి. అయినా దీని గొప్పతనం, దీని సత్యసంధత, దీని యదార్థాల విషయంలో, ఆయన చెప్పిన దాంట్లో ఏ ఒక్క అక్షరంగాని, పొల్లుగాని తప్పని రుజువుకాలేదు. కాని దీనికి భిన్నంగా ప్రపచంలో ఏ మానవ గ్రంథమూ ఇలా లోపరహితంగా, పరిశుద్ధంగా లేదు.

మరో మాటలో చెప్పాలంటే, ఖుర్ఆన్ దైవగ్రంథం అనే విషయానికి స్వయంగా ఖుర్ఆనే సాక్ష్యం దీనికి చాలా ఆధారాలున్నాయి. కాని నేనిక్కడ కేవలం మూడు విషయాలను ప్రస్తావిస్తున్నాను. ఒకటి: అసాధారణమైన దాని ప్రకటనా శైలి, రెండు: దీని అర్థం(వివరణ) పరస్పర వైరుధ్యానికి అతీతంగా ఉండటం, మూడు: దాని సార్వకాలికం.

1) దివ్య ఖుర్ఆన్ ఓ అసాధరణమైన వాణి. దీన్ని చదువుతూ ఉంటే దీని రచయిత ఏ మానవుడికీ లభ్యంకాని ఓ ఉన్నతమైన స్థానం నుండి చెపుతున్నట్లు మనకు అనిపిస్తుంది. దాని వాక్యనిర్మాణం, పదగాంభీర్యత, నిరణయాత్మకమైన ప్రకటనా శైలి ఎంతో అద్భుతంగా, మానవ వాక్కుకు పూర్తి విభిన్నంగా ఉంటాయి. వీటి ద్వారా ఇది విశ్వపాలకుని వాణి తప్ప మానవ మాత్రుని వాక్కు ఎంమాత్రం కాదని స్పష్టంగా తెలిసిపోయింది. విశ్వసనీయమైన ఈ అద్భుత వాణి స్వయంగా 'ఇది దేవుని గ్రంథం, దేవుడు దీని ద్వారా తన దాసులతో సంభాషిస్తున్నాడు' అని చెపుతోంది. ఖుర్ఆన్‌లో విశ్వ యదార్థాన్ని గురించి తెలియపరచటం జరిగింది. మానవుల కర్మల పర్యవసానం గురించి వివరించటం జరిగింది. జీవితానికి

సంబంధించిన సకలగోచర అగోచర విషయాలపై చర్చించటం జరిగింది. కాని ఇదంతా ఎంత ఖచ్చితంగా చెప్పబడిందంటే ఓ సంఘటనను గురించి చదువుతున్నప్పుడు దాన్ని ఖళ్ళారా చూస్తున్నంత అనుభూతి కలుగుతుంది. ఖుర్‌ఆన్ పఠిస్తున్నప్పుడు మనిషికి యదార్థానికి సంబంధించిన విషయాలు వివరించడం కాదు, ఆ యదార్థాన్నే తనముందు తెచ్చి నిలబెట్టినట్లు అనుభూతి కలుగుతుంది. అతడు సంఘటనలను గ్రంథం పేజీలలో చదవటంగాక ఆ సంఘటనల్ని, తెరపై (Screen) తన కళ్ళారా చూస్తున్నట్లు భావిస్తాడు. ఈవివరణ వల్ల ఈ వాణి యదార్థాల పరిపూర్ణ జ్ఞానం కలిగి ఉన్న శక్తి, వాణి అని మనకు స్పష్టంగా తెలిసిపోతుంది. ఉదాహరణకు నేనిక్కడ దివ్యఖుర్‌ఆన్ లోని ఓ చిన్న సూరాను పేర్కొంటాను.

**" ఆకాశం బ్రద్దలైనప్పుడు, నక్షత్రాలు చెదిరిపోయినప్పుడు, సముద్రాలు చీల్చబడినప్పుడు - అప్పుడు, ప్రతి మనిషికీ తాను ముందూ వెనుకా చేసుకున్న దంతా తెలిసిపోతుంది.**

**ఓ మానవుడా! పరమ దాత అయిన నీ ప్రభువును గురించి ఏ విషయం నిన్ను మోసంలో పడేసింది? ఆయనే నిన్ను సృష్టించాడు. ఎలాంటి లోపం లేకుండా నిన్ను తీర్చిదిద్దాడు. నిన్ను తగిన రీతిలో పొందికగా రూపొందించాడు. తాను తలచిన ఆకారంలో నిన్ను క్రమబద్ధంగా మలిచాడు.- ఎంత మాత్రం కాదు. (అసలు విషయం ఏమిటంటే) మీరు శిక్ష, ప్రతిఫలాలు లేవని తిరస్కరిస్తున్నారు. కాని మీపై కాపలా దారులు నియమించబడి ఉన్నారు. మీ చర్యల్ని ఒక కంట కనిపెడుతూ ఉండే గౌరవనీయులైన లేఖకులు మీపై నియమించబడ్డారు. మీరు చేసే ప్రతి పనీ వారికి తెలుసు.**

**నిశ్చయంగా సజ్జనులు సుఖసంతోషాలతో తేలియాడుతూ ఉంటారు. నిస్సందేహంగా దుర్జనులు నరకానికి పోతారు. తీర్పు దినంనాడు వారు అందులో ప్రవేశిస్తారు. ఇక అందులోంచి ఎంత మాత్రం బయటపడలేరు. అవును. ఆ తీర్పు దినం ఏమిటో నీకేమైనా తెలుసా? ఆ రోజున ఏ మనిషి కొరకూ ఏదైనా చెయ్యటమనేది ఎవరికీ సాధ్యం కాదు. ఆనాడు తీర్పు ఇచ్చే అధికారం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉ ంటుంది."**

**(అల్ ఇన్‌ఫితార్)**

జీవిత ఆద్యంతాలను గురించి సవివరంగా తెలిపిన ఈ వాణి ఎంత విశ్వాసంతో

నిండి ఉందో చూడండి! జీవితానికి, విశ్వానికి సంబంధించి చేసిన ఏ మానవ రచనా ఇటువంటి విశ్వసనీయమైన నమూనా (Model)ను చూపెట్టజాలదు. వందల సంవత్సరాల తరబడి మానవుడు విశ్వవాస్తవికతను గురించి ఆలోచిస్తున్నాడు. ఎందరో తత్వవేత్తలు, మహా సైంటిస్టులు పుట్టారు. కాని ఎవరూ ఇంత ఖచ్చితంగా చెప్పే సాహసం చేయ్యలేకపొయ్యారు. సైన్స్ నేడు కూడా తాను ఖచ్చితమైన, నిజమైన జ్ఞానానికి చాలా దూరంగా ఉన్నాననే విషయాన్ని అంగీకరిస్తోంది. కాని ఖుర్ఆన్ మాత్రం తాను విజ్ఞాన పరిధుల్ని పరివేష్టించి ఉన్నానని వాస్వవికతకు సంబంధించిన సంపూర్ణ జ్ఞానం తనకే ఉందని పటిష్టమైన విశ్వాసంతో ప్రకటిస్తోంది.

2) ఖుర్ఆన్ దైవవాణి అనటానికి మరో ఆధారం ఏమిటంటే, అది పరలోక విషయం మొదలుకొని, నేటి సంస్కృతీ సమస్యల వరకు, ముఖ్యమైన సమస్త విషయాలపై చర్చించింది. కాని ఎక్కడా దాని బోధనల్లో వైరుధ్యం అనేది కానరాదు. ఈ వాణి అవతరించి దాదాపు వేయిన్నర సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఈ కాల వ్యవధిలో మానవుడు ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకున్నాడు. కాని ఈవాణిలో మాత్రం ఎటువంటి వైరుధ్యమూ ప్రస్ఫుటమవ్వలేదు. మానవుల్లో నుండి ఏ తత్వవేత్త వాణి (మాట) కూడా పరస్పర వైరుధ్యానికి, అభిప్రాయభేదానికి అతీతంగా లేదు. ఆ కాలంలో ఎంతో మంది తత్వవేత్తలు పుట్టారు. వారంతా తమకున్న పరిమిత జ్ఞానంతో జీవితానికి, విశ్వానికి సంబంధించి ఓ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ప్రయత్నం చేశారు. కాని వారి మాటలు, అభిప్రాయాల్లోని వైరుధ్యం అతి తొందరలో బయటపడింది. కాలం దాన్ని రద్దు చేసింది.

ఏ మాటైనా వైరుధ్యాలకు అతీతంగా ఉందంటే, అది యదార్థానికి అతి దగ్గరగా ఉ ఒదని అర్థం. ఎవరైనా వాస్తవాల జ్ఞానం లేకుండానే, లేక ఏ కొద్దోగొప్పో జ్ఞానం కలిగి ఉన్నా, అంటే, ఏ యదార్థాన్నయితే తాను చెప్పదలుస్తున్నాడో దానికి సంబంధించిన సంపూర్ణ జ్ఞానం లేకుండానే అతడు చెప్పదలిస్తే తప్పకుండా వైరుధ్యాలకు గురవుతాడు. అంటే ఒకదానికొకటి పొంతనే ఉండదు. అతడు చెప్పదలుచుకున్నదాని ఓ భాగాన్ని వివరిస్తే మరో భాగాన్ని వివరించలేడు. అతడు ఓ దిశ వైపు సాగితే మరో దిశ పూడుకుపోతుంది.(అంటే అరకొర జ్ఞాని అన్నమాట). జీవితానికి, విశ్వానికి సంబంధించిన ప్రశ్న ఓ సుదీర్ఘమైన సిద్ధాంత ప్రశ్న. దీనికోసం సర్వయదార్థాల జ్ఞానం ఉండటం ఎంతో అవసరం. కాబట్టి మానవుడు తన పరిమిత సామార్థ్యాలతో సకల యదార్థాల జ్ఞానం సంపాదించలేడు. అందుకని అతడు అన్ని విషయాలను సవివరంగా తెలుసుకోలేడు. కూడా. ఈ కారణంగానే మానవుడు రచించిన తత్వశాస్త్రాలు వైరుధ్యాలు తప్పకుండా కనిపిస్తాయి. ఖుర్ఆన్ ఈ విధమైనటువంటి సకల వైరుధ్యాలకు

అతీతంగా, పరిశుద్ధంగా ఉంది. దీనికి దాని యదార్థాలే ఆధారం. ఈ విషయాన్ని నేను ఉ దాహరణ రూపంలో వివరిస్తాను.

1. జీవితం అనే అంశంపై ఏదైనా గ్రంథం వ్రాస్తే, అందులోని ఓ అధ్యాయంలో జీవిత విధుల్ని నిర్ణయించటం తప్పనిసరి అయి ఉంటుంది. ఈ విధుల్ని నిర్ణయించటంలో వాటి విభిన్న భాగాలను చక్కగా సమైక్యపరచటం, ఓ కోణాన్నుండి ఇవ్వబడే ఆజ్ఞ మరో కోణానికి విరుద్ధంగా ఉండకుండా జాగ్రత్త వహించటం కూడా అవసరమే. ఉదాహరణకు స్త్రీ, పురుషుల స్థానాలను నిర్ణయించటం సాంస్కృతిక జీవనానికి సంబందధించిన ముఖ్య సమస్య. నేటి అభ్యుదయ యుగం స్త్రీ,. పురుషుల మధ్య సమానత్వం కావాలని, జీవితపు ప్రతి రంగంలో ఇద్దరికీ సమానంగా పనిచేసే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తోంది. కాని ఇక్కడ మానవ కల్పితమైన ఈ సూత్రం ఓ అతిముఖ్యమైన యదార్థాన్ని ఢీకొంటోంది. అంటే జీవశాస్త్రం (Biology) ప్రకారం ఈ రెండు జాతుల మధ్య (స్త్రీ, పురుషుల మధ్య) సమానత్వం లేదు. ఇద్దరూ ఒకే విధంగా జీవిత భారాన్ని మోయటం కూడా సాధ్యపడదు. దీనికి భిన్నంగా ఖుర్ఆన్ సాంస్కృతిక జీవితంలో స్త్రీ, పురుషులకు ఏ స్థానమైతే ప్రసాదించిందో అది వారిరువురి పుట్టుక రీత్యా పూర్తి అనుకూలంగాఉంది. చట్టం యదార్థాల మధ్య ఎటువంటి వైరుధ్యాలు పొడసూపటానికి దీనిలో ఎంత మాత్రం ఆస్కారం లేదు.

2. మార్క్స్ విప్లవ తత్వజ్ఞానాన్ని ఏమంటాడంటే, ఏవిధంగానైతే గురుత్వాకర్షణ విశ్వజనీన శాసనం ద్వారా నక్షత్రాలు కదులుతున్నాయో, అదేవిధంగా కొన్ని అనివార్య చారిత్రక చట్టాలు సామాజిక మార్పులకు కారణమవుతుంటాయి. ఈ చట్టాలు ఎడతెగకుండా తమ పని చేస్తున్నాయి. దీని ప్రకారమే మానవ జీవితాల్లో విప్తవాలు వస్తుంటాయి. అయితే ఈ తత్వశాస్త్రాన్ని రచించటంతోపాటు అతను "ప్రపంచ కార్మికులారా! ఏకంకండి" అనే నినాదాన్ని కూడా లేవదీశాడు.

మార్క్స్ చెప్పిన ఈ రెండు మాటలూ ఒకదానికొకటి పొంతన లేకుండా పరస్పర విరుద్ధంగా ఉన్నాయన్నది స్పష్టంగా తెలుస్తుంది. ఒకవేళ సామాజిక మార్పులకు ఏదైనా అనివార్య చారిత్రక చట్టాలే కారణమైతే, రాజకీయ పోరాటం అవసరం ఎంతమాత్రం లేదు. ఒకవేళ రాజకీయ పోరాటం ద్వారానే విప్లవాలు సంభవిస్తే మరి ఈ అనివార్య చారిత్రక చట్టం అనే మాటకు అర్థమేమిటి?

దీనికి భిన్నంగా ఖుర్ఆన్ మానవ అభిప్రాయాలను అంగీకరిస్తుంది. జీవితంలో ఏ

సంఘటనలైతే ఎదురవుతాయో, అవి మానవుడు స్వయంగా చేసుకున్న ప్రయత్నాల ఫలితాలే అనేది దాని తత్వజ్ఞానం. భౌతిక ప్రపంచం మాదిరిగా ఓ తప్పనిసరి శాస్త్రం అంటూ ఏదీ లేదు. మానవ ప్రయత్నం వాటికి ఏ రూపాన్నయినా ఇవ్వవచ్చు. నిస్సందేహంగా ప్రకృతికి కొన్ని చట్టాలు, నియమాలున్నాయి. ఈ సందర్భంలో అవి ప్రముఖ పాత్ర వహిస్తాయి. కాని ఆ నియమాల తత్వం ఏమిటంటే, అవి మానవ ప్రయత్నాలకు సహకరించి అతన్ని గమ్యానికి చేర్చుతాయి. అంతేగాని, మానవ ప్రయత్నాలు ప్రకృతి నియమాలను ప్రభావితం చేయలేవు. ఈ విధంగా ఖుర్‌ఆన్ సిద్ధాంతం, దాని సందేశంలో ఏ విధమైనటువంటి వైరుధ్యం లేదు. దీనికి భిన్నంగా మార్క్సు తత్వజ్ఞానం దాని ఆచరణాత్మక కార్యక్రమాన్ని కొట్టిపారవేస్తుంది. కమ్యూనిస్టు పార్టీల ఉనికి వాస్తవంగా మార్క్సు తత్వజ్ఞానానికి పూర్తి వ్యతిరేకం. కమ్యూనిస్టు మ్యానిఫెస్టోలోని చివరి వాక్యం, దాని మొదటి వాక్యాన్ని రద్దు చేస్తుంది.

ఖుర్‌ఆన్ బోధనలను ఒకవేళ మీరు మానవ తత్వశాస్త్రాలతో పోల్చి చూసినట్లయితే ఇటువంటి ఉదాహరణలు ఎన్నో చూస్తారు.

3. ఖుర్‌ఆన్ మూడవ ప్రత్యేకత ఏమిటంటే అది దాదాపు వేయిన్నర సంవత్సరాలుగా భూమిపై ఉంది. ఈ పదిహేను వందల సంవత్సరాల కాలంలో ఎన్నో విప్లవాలు వచ్చాయి. చరిత్రలో ఎన్నో సంఘటనలు జరిగాయి. కాలం ఎన్నో మలుపులు తిరిగింది. అయినా నేటివరకూ దాని ఏ ఒక్క మాటా అసత్యమని రుజువుకాలేదు. అది ప్రతి కాలంలో బుద్ధివివేచనలకు, సాంస్కృతిక అవసరాలకు ఎడతెగని సహకారం అందజేస్తూనేపోయింది. దీని బోధనల్లోని సార్వజనీనత ఎక్కడా అంతం కాలేదు. అది ప్రతి కాలపు సమస్య లకు చక్కని పరిష్కారం చూపుతుంది. ఇంతవరకూ ఏ మానవ గ్రంథానికీ లభ్యంకానీ ప్రత్యేకత ఈ మహోన్నత గ్రంథానికి లభ్యమైంది. మానవ విరచితమైన ప్రతి తత్వశాస్త్రం కేవలం కొన్ని దినాల్లోనే తన తప్పిదాన్ని బహిర్గతపరుచుకుంటుంది. కాని శతాబ్దాలపై శతాబ్దాలు గడిచిపోయినప్పటికీ ఈ గ్రంథం (ఖుర్‌ఆన్) లోని నిజాయితీలో రవ్వంత తేడా కూడా గోచరించలేదు.

నాటి అనాగరిక అరబ్బు తెగల్లో ఇస్లామియ రాజ్యం స్థాపించాలనే సమస్య ఉత్పన్నమైనప్పుడు ఈ చట్టం రూపొందించబడింది. కాని అది ఆ తరువాత కూడా శతాబ్దాలుగా ఇసాలమియ పాలనకు పూర్తిగా సహకరిస్తూ దాని అవసరాలకు నెరవేరుస్తూ వచ్చింది. అది కేవలం ఆనాటి కాలానికే పరిమితం కాకుండా నేటి అభివృద్ధి చెందిన యుగంలో కూడా సకల జీవన సమస్యలనూ పరిష్కరించే ఏకైక వ్యవస్థ ఇదే. వేయిన్నర సంవత్సరాలకు పూర్వం అది ఏవిధంగా ఔన్నత్యాన్ని కలిగి ఉందో, అదే విధంగా నేడు కూడా అది సకల తత్వశాస్త్రాలపై

ఆధిక్యతను కలిగి ఉంది.

ఖుర్‌ఆన్ మహిమ ఏమిటంటే, జీవితం విషయంలో అది ఏ సిద్ధాంతాన్నయితే ప్రవేశపెట్టిందో, వ్యక్తి, సంఘాల ఆచరణ కోసం అది ఏ ప్రణాళికలనైతే ప్రతిపాదించిందో అది నేటికి పాతబడిపోలేదు. దానిలో ఏ విధమైనటువంటి లోపాలను ఎత్తిచూపలేము. ఆ కాలంలో ఎంతో మంది తత్వవేత్తలు పుట్టి గిట్టి పొయ్యారు. ఎన్నో వ్యవస్థలు నిర్మాణమై, విచ్ఛిన్నమైపొయ్యాయి. కాని ఖుర్‌ఆన్ సిద్ధాంతంలోని సత్యత, దాని ఆచరణాత్మక వ్యవస్థలోని లాభాలు నేడు కూడా ఆమోదయోగ్యమైనవిగా, గాలి–నీరులాగా కాలాతీతమై స్వేచ్ఛగా ఉన్నాయి. ఇది దివ్యఖుర్‌ఆన్ మహిమ!

నేనిక్కడ రెండు కోణాల నుండి ఒక్కో ఉదాహరణ పేర్కొంటాను. విశ్వాన్ని ప్రేరేపించిన ఓ మేధ ఉంది. అదే తన ఇష్టానుసారం విశ్వాన్ని నడిపిస్తోంది. అనేది ఖుర్‌ఆన్ దావా (Challange) యూరప్ పునరేకీకరణకు చాలా పూర్వమే ఖుర్‌ఆన్ ఈ దావా చేసింది. తరువాత చాలా మంది తత్వవేత్తలు, సైంటిస్టులు, విశ్వం కేవలం ఓ భౌతిక యంత్రమేనని, అది తనంతట తానే కదులుతూ ఉంటుందని చాలా పకడ్బందీగా వాదించారు. వీరి ఈ సిద్ధాంతం రెండు వందల సంవత్సరాల వరకూ మానవ మేధపై రాజ్యమేలింది. సైన్స్ ముందు ఖుర్‌ఆన్ ఛాలెంజ్ రద్దయిపోయిందా అనిపించిది. కాని, ఆ తరువాత జీవితం, విశ్వ సిద్ధాంతం మూలం కేవలం ప్రకృతి నియమాల వల్ల కాజాలదు అనే విషయం విశ్వపరిశీలన అనంతరం స్వయంగా సైంటిస్టులకు అర్థమైపొయింది. ఇప్పుడు సైన్స్ రోజుకు రోజు విశ్వం వెనుక దీన్ని నడిపే ఓ మేధ ఉంది. అదే తన అభీష్టం ప్రకారం దీన్ని నడుపుతోంది అనే ఖుర్‌ఆన్ సిద్ధాంతం వైపు మరలుతోంది. ప్రఖ్యాత సైంటిస్ట్ 'సర్ జేమ్స్ జీన్స్' ఈ మార్పులపై వాఖ్యానిస్తూ ఇలా వ్రాస్తున్నాడు:

"......జ్ఞాన సముద్రం గత కొన్ని సంవత్సరాలలో అతివేగంగా ఓ నూతన మలుపు తిరిగింది. ముప్ఫయి సంవత్సరాల క్రితం మేము తన తత్వంలో యాంత్రికంగా ఉండే చివరి యదార్థం వైపునకు సాగిపోతున్నామని అభిప్రాయపడ్డాము. విశ్వం ఓ క్రమంలేని అణువుల కుప్పగా ఉండి, ఆ అణువులు కాకతాళీయంగా ఏకమైపొయ్యాయి. వీటి పనేమిటంటే లక్ష్యరహిత, అంధశక్తుల అధికారం క్రింద ఎలాగైతే ఏవీ జ్ఞానాన్ని కలిగి ఉండవో అలాగే కొంత కాలం పాటు ఇవి ఓ అర్థరహిత నృత్యం చేసి అంతమైపోతాయి. ఫలితంగా కేవలం ఓ మృతవిశ్వమే మిగిలి ఉంటుంది. స్వచ్ఛమైన ఈ యాంత్రిక ప్రపంచంలో, పైన పేర్కొన్న అంధశక్తుల ఆచరణా కాలంలో జీవితం ఓ ప్రమాదం మాదిరిగా కాకతాళీయంగా ప్రవేశించింది.

విశ్వంలోని ఓ అతిచిన్న భాగం (ఓ అతి చిన్న కోణం) లేదా ఈ విధమైనటువంటి ఎన్నో కోణాలు (మూలలు) కొంత కాలం కోసం కాకతాళీయంగా చైతన్యవంతమయ్యాయని మేము భావించాము. కాని ప్రస్తుత పరిశోధనల వెలుగులో జ్ఞాన సముద్రం మమ్మల్ని యాంత్రికం కానట్టి యదార్థం వైపునకు తీసుకుపోతోందనేది దాదాపు సైన్స్ ఏకాభిప్రాయం."

ఈ సందర్భంలోనే ఆయన ఇంకా ఇలా వ్రాస్తున్నాడుః " మేము తొందర పాటులో తీసుకున్న నిర్ణయాల పట్ల మరోసారి దృష్టి సారించమని నూతన పరిశోధన మాపై వత్తిడి తెస్తోంది. అంటే మేము జీవితంలో ఏ సంబంధమూ లేని ఓ విశ్వంలో యాదృచ్ఛికంగా వచ్చి పడ్డాము. లేక ఓ పద్ధతి ప్రకారం అది జీవితంతో విరోధం కలిగిఉంది. ఇప్పుడు విశ్వం ఒక సృష్టికర్త లేదా అదుపుచేసే ఓ అసాధరణ శక్తి ఉనికికి (Designing Controlling Power) రుజువు సమకూర్చిపెట్టింది. అది మన వ్యక్తిగతమైన మేధకు పోలి ఉందనే విషయం మాకు తెలిసిపోయింది. (మాడ్రన్ సైంటిఫిక్ థాట్, పేజీ : 104)

అదొక దృష్టికోణపు ఉదాహరణ. ఇప్పుడు ఆచరణాత్మక కోణం నుండి ఓ ఉదాహరణ తీసుకుందాం! ఇస్లాం సామాజిక జీవితం కోసం ఏ చట్టాన్నయితే రూపొందించిందో, ఆ చట్టంలో ఒక పురుషునికి నలుగురు స్త్రీల వరకు వివాహం చేసుకోవచ్చు అనే అనుమతి ఇవ్వబడింది. ఇస్లాం తరువాత పాశ్చాత్య నాగరికత ఉనికిలోకి వచ్చినప్పుడు అది ఈ చట్టాన్ని ఎంతగానో అవహేళన చేసింది. దీన్ని అజ్ఞాన కాలపు ఆటవిక చట్టంగా అభివర్ణించింది. దాని దృష్టిలో ఈ చట్టం స్త్రీల పట్ల చాలా అన్యాయం చేసేదిగా ఉంది. ఈ పునాదులపై ఎప్పుడూ ప్రగతిశీల సంస్కృతీ నిర్మాణం కాజాలదని పేర్కొన్నది. క్రైస్తవ మతంలో ఒకరికంటే ఎక్కువ మందిని చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ పాశ్చాత్య నాగరికత దాన్ని తొలగించింది. ఒకరికంటే ఎక్కువ మందిని వివాహం చేసుకోవటం అతి నీచమైన కార్యమని ఉధృతంగా ప్రచారం చేసింది. ఫలితంగా ఏ పురుషుడూ మరో వివాహం చేసుకోవటానికి సాహసించలేక పొయ్యాడు. ఏ స్త్రీ కూడా రెండవ, లేక మూడవ భార్యగా కనీసం ఊహించనైనా ఉహించలేకపొయ్యేది.

కాని పరిస్థితులు – ముఖ్యంగా రెండవ ప్రపంచం యుద్ధ పరిస్థితులు ఒకరికంటే ఎక్కువ వివాహాల అనుమతి ఆచరణాత్మక మానవ జీవితానికి ఎంతైనా అవసరం అనే విషయాన్ని రుజువు చేశాయి. అప్పుడప్పుడూ కొందరి వ్యక్తిగత జీవితాల్లోనో, లేక మొత్తం సంఘ జీవితంలోనో ఇటువంటి అసాధరణమైన పరిస్థితులు ఉత్పన్నమవుతాయి. అంటే అశ్లీలాన్నీ, వ్యభిచారాన్నీ అంగీకరించి పూర్తి నాగరికతనే భయంకరంగా మార్చివేయడమో లేక బహుభార్యాత్వాన్ని స్వీకరించి సమస్యను సునాయాసంగా పరిష్కరించి సమాజంలో అశ్లీల వ్యాప్తిని నిరోధించటమో,

ఈ రెంటిలో దేన్నో ఒకదాన్ని ఎన్నుకోవటం అత్యంత అవసరం. రెండవ ప్రపంచం యుద్ధానంతరం యుద్ధంలో పాల్గొన్న యావత్తు దేశాల్లో స్త్రీల సంఖ్య బాగా పెరిగిపోయింది. పురుషులు యుద్ధంలో చంపబడటం వల్ల పురుషుల సంఖ్య తగ్గిపోయి స్త్రీల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. దాని ప్రభావం నేటికి మనకు కన కనబడుతూ ఉంది. 1955నాటి జనాభా లెక్కల ప్రకారం–జపాన్‌లో ఒక్కో పురుషునికి ఎనిమిదేసి మంది స్త్రీలు ఉన్నారు. ఈ యుద్ధ ప్రభావం ఎక్కువగా జర్మనీపై పడింది. అక్కడ అసంఖ్యాక స్త్రీలు విధవలయ్యారు. మరెందరో పిల్లలు అనాథలయ్యారు. యుక్త వయసు అమ్మాయిలకు వరుడు దొరకటం కష్టతరమైపోయింది. ఈ కారణంగా ఆ దేశాల్లో దిక్కులేని, అక్రమ సంతానం గణనీయంగా పెరిగిపోయింది. అనాథలైన పిల్లలకు సంరక్షకుడంటూ ఎవరూ లేరు. భర్తలను పోగొట్టుకున్న స్త్రీలు తమ సహజ అవసరాలకు లొంగిపోయి తమ కోరికలు తీర్చుకోవటానికి అక్రమ మార్గాలను అవలంబించటం ప్రారంభించారు. పర్యవసానం ఎంతవరకు వచ్చిందంటే, జర్మనీలో కొంతమంది మహిళల గృహాలకు “Wanted an Evening Guest” (రాత్రి గడపటానికి ఓ అతిథి కావాలి) అనే బోర్డులు వ్రేలాడుతుండేవి.

పాశ్చాత్య మేధావులు ఇప్పటి వరకూ ఈ విషయంలో తమ తప్పును అంగీకరించకపోయినా, పరిస్థితులు (సంఘటనలు) మాత్రం ఆ తప్పును స్పష్టంగా రుజువుచేశాయి. వారు స్వయంగా తమ నోటితో ఈ విషయాన్ని అంగీకరించే రోజు కూడా ఎంతో దూరంలేదు. వివాహం (నికాహ్) విషయంలో ఏ నియమాలనైతే పాశ్చాత్యుల స్వీకరించారో, దాని అర్థం సమాజాన్ని అశ్లీలంలో ముంచి, అసంఖ్యాక చెడుల (నేరాల) ద్వారాలు తెరవటమేనని వారికి అప్పుడు తెలిసిపోతుంది. అప్పుడు ఇస్లామియా సూత్రాలు అసలు సమస్యను అద్భుతమైన రీతిలో పరిష్కరించి సమాజాన్ని ఘోరమైన నష్టాల నుండి రక్షిస్తుందనేది కూడా తెలిసిపోతుంది.

ఖుర్‌ఆన్ సిద్ధాంతాలు, దాని చట్టాలకు సంబంధించిన ఈ రెండు ఉదాహరణల ద్వారా, మానవ కల్పిత సిద్ధాంతాలు, చట్టాలు నిర్మించబడుతూ విచ్ఛిన్నమవుతూ వచ్చాయనేది స్పష్టంగా తెలిసిపోతోంది. కాని ఖుర్‌ఆన్ ప్రారంభంలో ఏదైతే చెప్పిందో, నేటి వరకూ దాని సత్యతలో ఎలువంటి వ్యత్యాసం రాలేదు. అది మొదట్లో ఏ విధంగా యదార్థమో, నేడు కూడా అలాగే అది యదార్థం. ఖుర్‌ఆన్ ఈ ప్రత్యేకత వల్ల మనకు అర్థమయ్యే దేమిటంటే భూత, భవిష్యత్తు కాలాలకు సంబంధించిన సకల జ్ఞాన పరిధుల్ని పరివేష్టించి ఉన్న ఓ మేధ నుండి ఇది ఉనికిలోకి వచ్చింది. దీని శాశ్వత స్థిరత్వమే ఇది దైవవాణి అనటానికి ప్రత్యక్ష నిదర్శనం.

సోదురాలా! మన అధ్యయనం మన కోసం వాస్తవికతా ద్వారాలను తెరిచింది. మనం ఈ శీర్షికను "నేనెవరిని, ఈ విశ్వం ఏమిటి?" అనే ప్రశ్నతో ప్రారంభించాము. ఈ ప్రశ్నకు సమాధానం చాలా మంది తమ మేధతో చెప్పటానికి ప్రయత్నించారు. కాని, ఈ సమాధానాలు వాస్తవికతకు సరైన వివరణను ఇవ్వలేవు. తరువాత అరేబియా నుండి వెలువడిన ఓ శబ్దం మన చెవులకు తాకింది, మనం దాన్ని గురించి ఆలోచించాము. దాన్ని విశ్వం ఫ్రేములో అమర్చిచూశాము. మానవ చరిత్రలో దాన్ని పరీక్షించి చూశాము. ప్రకృతి లోతుల్లోకి దిగి దాన్ని గుర్తించే ప్రయత్నం చేశాము. విశ్వం, చరిత్ర, మానవ నైజం కలసి దాన్ని ధృవపరుస్తున్నట్లు మనం కనుగొన్నాము. మన జ్ఞానం, మన భావోద్రేకాలు పూర్తిగా దాన్ని సమర్థిస్తున్నాయి. ఏ యదార్థాన్ని గురించైతే మనం అన్వేషిస్తున్నామో దాన్ని మనం పొందాము. ఇక ఇప్పుడు మనం దాని పట్ల ఎలా ప్రవర్తించామో నిర్ణయించుకోవలసి ఉంది.

**సమాప్తం**

# MAULANA WAHIDUDDIN KHAN
## English Books Free Download

**CPS INTERNATIONAL**

Presenting Islam Relevant to the Modern Age

WEBSITE: **WWW.CPSGLOBAL.ORG**

CONTACT US AT: **INFO@GLOBAL.ORG**

## DISCOVER GOD

By Contemplating on His Creation

NAME OF BOOK

1. DISCOVERING GOD
2. REALIZATION OF GOD
3. ATTRIBUTED OF GOD
4. MAN AND GOD
5.REMEMBRANCE OF GOD
6. IN SEARCH OF GOD
7. GOD-ORIENTED LIFE
8. THE CONCEPT OF GOD
9. THE WAY TO FIND GOD

## RELIGION AND SCIENCE

Rational Interpretation of Religion

NAME OF BOOK

1. GOD ARISES
2. RELIGION AND SCIENCE
3. ISLAM: THE VOICEOF HUMAN NATURE
4. ISLAM AS IT IS
5.THE VISION OF ISLAM
6. DISCOVER ISLAM

## SEARCH FOR TRUTH

Creation Plan of God

NAME OF BOOK

1. THE PURPOSE OF CREATION
2. REFLECTIONS OF LIFE AND DEATH
3. THE FINAL JOURNEY
4. LIFE, DEATH AND BEYOND
5. SEARCH FOR TRUTH
6. MAN KNOW THYSELF
7. THE REALITY OF LIFE
8. THE PURPOSE OF LIFE
9. THE CREATION PLAN OF GOD
10. GOD AND LIFE HEREAFTER

## ISLAMIC SPIRITUALITY

Developing a Paradisiacal Personality

NAME OF BOOK

1. TAZKIYAH:PURIFICATION OF THE SOUL
2. LEADING A SPIRITUAL LIFE
3. SPIRITUALITY IN ISLAM

## WISDOM OF LIFE

Living in Hope and Positivity

NAME OF BOOK

1. LIVING IN HOPE: OPPORTUNITIES AMIDST PROBLEMS
2. THE SECRET OF SUCCESS
3. THE MORAL VISION

## THE QURAN

God's Preserved Guidebook for Man

NAME OF BOOK

1. THE QURAN TRANSLATION ( IN 30 LNG)
2. QURAN COMMENTARY
3. DISCOVERING THE QURAN
4. THE QURAN: AN ABIDING WONDER
5. THE QURAN FOR ALL HUMANITY
6. QURANIC WISDOM
7. QURAN POCKET GUIDE
8. THE GOOD LIFE
9. A TREASURY OF THE QURAN

## APPLICATION OF PROPHETIC MODEL

Guidance for All Mankind

NAME OF BOOK

1. 100 PRINCIPLES FORPURPOSEFUL LIVING
2. MUHAMMAD: A PROPHET FOR ALL HUMANITY
3. THE PROPHET MUHAMMAD: A SIMPLE GUIDE TO HIS LIFE
4. AN ISLAMIC TREASURY OF VIRTUES
5. MUHAMMAD:THE IDEAL CHARACTER
6. WORDS OFTHE PROPHET MUHAMMAD
7. THE PROPHET MUHAMMADPOCKET GUIDE

## REDISCOVER ISLAM

**Differentiate between Islam and Muslims**

NAME OF BOOK

1. ISLAM REDISCOVERED
2. WHAT IS ISLAM?
3. A SIMPLE INTRODUCTION TO ISLAM
4. INTRODUCING ISLAM
5. PRINCIPLES OF ISLAM
6. THE TEACHINGS OF ISLAM
7. ISLAM AND SULTAN
8. THE MAN ISLAM BUILDS
9. SPIRIT OF RAMADAN
10. RAMADAN:A MONTH OF PURIFICATION

## ISLAM AND THE MODERN AGE

Interpretation of Islam in Contemporary Style

NAME OF BOOK

1. THE ROLE OF ULAMA INTHE MODERN AGE
2. ISLAM: THE CREATOROF THE
3. THE SEEKER'S GUIDE
4. SIMPLE WISDOM
5. ISLAM AND THE MODERN MAN
6. ISLAM IN HISTORY
7. THE REVOLUTIONARY ROLE OF ISLAM
8. ISLAM STANDS THE TEST OF HISTORY
9. THE SHARIAH AND ITS APPLICATION

## TRUE FACE OF ISLAM

Religion of Peace

NAME OF BOOK

1. THE CONCEPT OF JIHAD IN ISLAM
2. THE POLITICALNTERPRETATION
3. THE TRUE JIHAD
4. ISLAM AND HUMAN WELFARE
5. TABLIGH MOVEMENT
6. ISLAM POCKET GUIDE
7. ISLAMIC FUNDAMENTALISM

## WOMEN IN ISLAM

Builders of Humanity

NAME OF BOOK

1. WOMAN BETWEEN ISLAM AND WESTERN SOCIETY
2. WOMAN BETWEEN ISLAM AND
3. THE SECRET OF ASUCCESSFUL FAMILY LIFE
4. POLYGAMY AND ISLAM
5. CONCERNING DIVORCE
6. HIJAB IN ISLAM

## PEACE IN ISLAM

Peace for the Sake of Peace

NAME OF BOOK

1. THE IDEOLOGY OF PEACE
2. ISLAM AND PEACE
3. ISLAM AND WORLD PEACE
4. THE DAWN OVER KASHMIR
5. PEACE IN KASHMIR
6. HOW TO ESTABLISH PEACE IN THE HOLY LAND
7. THE AGE OF PEACE
8. NON-VIOLENCE AND ISLAM
9. MANIFESTO OF PEACE

## INTERFAITH DIALOGUE

For Mutual Learning and Peace-Building

NAME OF BOOK

1. NON-VIOLENCE AND PEACE-BUILDING
I IN ISLAM
2. MANIFESTO OF PEACE
3. UNIFORM CIVIL CODE

## THE ALARM OF DOOMSDAY

The Beginning of the End of Human History

NAME OF BOOK

1. INTERPRETATION OF HUMAN HISTORY
2. PARADISE: THE FINAL PHASE OF THE
3. GLOBAL WARMING: THE DIVINE WARNING OF DOOMSDAY

## CALL TO GOD

Conveying the Divine Message to All

NAME OF BOOK

1. THE CALL OF THE QURAN
2. RE-PLANNING OF THE ISLAMIC
3. THE PROPHETIC ROLE OF NOAH
4. DAWAH MADE SIMPLE
5. DAWAH: THE MISSION OF
6. CALLING PEOPLE TO GOD
7. ISLAMIC ACTIVISM
8. THE GARDEN OF PARADISE
9. THE ROAD TO PARADISE

## ISLAM

### God-Centred Religion

**NAME OF BOOK**

1. DOES GOD EXIST?
2. THE DISCOVERY OF GOD
3. MAN DOES NOT STAND ALONE
4. MAN AND GOD
5. DOES THE WORLD OF THE HEREAFTER
6. THE DESTINATION OF MAN
7. THE IDEOLOGY OF LIFE
8. THE CREATION PLAN OF GOD

## ISLAM

### God-Centred Religion

**NAME OF BOOK**

1. GOD-ORIENTED LIFE
2. THE IDEOLOGY OF PEACE
3. THE ROOT CAUSE OF TERRORISM
4. PEACE IN ISLAM
5. PEACE IN THE QURAN
6. THE IDEOLOGY OF SPIRITUALITY
7. TAZKIYAH: PURIFICATION OF THE SOUL
8. KASHMIR: AN INTRODUCTION TO PARADISE

## ISLAM

### God-Centred Religion

**NAME OF BOOK**

1. GLOBAL WARMING OR DIVINE
2. THE CRISIS OF MUSLIMS
3. ABOUT THE QURAN
4. ABOUT THE HADITH
5. THE SPIRIT OF SALAT
6. RAMADAN: THE MONTH OF FASTING
7. ZAKAT: THE PRESCRIBED CHARITY
8. HAJJ:THE PILGRIMAGE TO MAKKAH

## LIST OF ENGLISH LEAFLETS

1. About the Hadith
2. About the Quran
3. Does God Exist?
4. Does the World of the Hereafter Exist?
5. Global Warming or Divine Warning
6. God-Oriented Life
7. Hajj: The Pilgrimage to Makkah
8. Kashmir: An Introduction to Paradise
9. Man and God
10. Man Does Not Stand Alone
11. Peace in Islam
12. Peace in the Quran
13. Ramadan: The Month of Fasting
14. Tazkiyah: Purification of the Soul
15. The Creation Plan of God
16. The Crisis of Muslims
17. The Destination of Man
18. The Discovery of God
19. The Ideology of Life
20. The Ideology of Peace
21. The Ideology of Spirituality
22. The Root Cause of Terrorism and Its Solution
23. The Spirit of Salat
24. Zakat: The Prescribed Charity

ఖుర్ఆన్ ప్రత్యేకతేమిటంటే అది దాదాపు వేయిన్నర సంవత్సరాలుగా భూమిపై ఉంది.ఈ పదిహేను వందల సంవత్సరాల కాలంలో ఎన్నో విప్లవాలు వచ్చాయి. చరిత్రలో ఎన్నో సంఘటనలు జరిగాయి. కాలం ఎన్నో మలుపులు తిరిగింది. అయినా నేటి వరకూ దాని ఏ ఒక్క మాటా అసత్యమని రుజువు కాలేదు. అది ప్రతికాలంలో బుద్ధివివేచనలకు, సాంస్కృతిక అవసరాలకు ఎడతెగని సహకారం అందజేస్తూ పోయింది. దీని బోధనల్లోని సార్వజనీనత ఎక్కడా అంతం కాలేదు. అది ప్రతికాలపు సమస్యలకుచక్కని పరిష్కారం చూపుతుంది. ఇంతవరకూ ఏ మానవ గ్రంథానికీ లభ్యంకాని ప్రత్యేకత ఈ మహోన్నత గ్రంథానికి లభ్యమైంది. మానవ విరచితమైన ప్రతి తత్వశాస్త్రం కేవలం కొన్ని దినాల్లోనే తన తప్పిదాన్ని బహిర్గతపరుచుకుంటుంది. కాని శతాబ్దాలపై శతాబ్దాలు గడిచిపోయినప్పటికీ ఈ గ్రంథం (ఖుర్ఆన్‌లోని) నిజాయితీలో రవ్వంత తేడా కూడా గోచరించలేదు. ఖుర్ఆన్ ప్రారంభంలో ఏదైతే చెప్పిందో, నేటి వరకూ దాని సత్యతలో ఎటువంటి వ్యత్యాసం రాలేదు. అది మొదట్లో ఏ విధంగా యదార్థమో, నేడు కూడా అలాగే అది యదార్థం. ఖుర్ఆన్ ఈ ప్రత్యేకత వల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే భూత, భవిష్యత్తు కాలాలకు సంబంధించిన సకల జ్ఞాన పరిధుల్ని పరివేష్టించి ఉన్న ఓ మేధ నుండి ఇది ఉనికిలోకి వచ్చింది. దీని శాశ్వత స్థిరత్వమే ఇది దైవవాణి అనటానికి ప్రత్యక్ష నిదర్శనం.

Good Word
info@goodwordboks.com
www.goodwordbooks.com